ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 156 | శుక్రవారం 6 మార్చి 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

**హాజరైన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా**



**పాట్నా, (తెలుగోడు),మార్చి 5 :**

బీహార్ సీఎం నితీశ్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేపర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం అమిత్ షా పాట్నాకు వచ్చారు. ఆయనకు సిఎం నితీశ్ స్వాగతం పలికారు. బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితీశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు. నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్దాల పాటుతనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞలు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన (మిగతా 2లో)




- మిస్సైళ్లు, డ్రోన్లతో ఇజ్రాయిల్, అమెరికాలకు దీటుగా జవాబు..
- భీకరంగా విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి..
- 10 దేశాలపై ఏకధాటిగా దాడిచేస్తున్న ఇరాన్...
- దాడులకు ముందే చైనా ఆయుధాలు సరఫరా..
- చైనా సహకారంతోనే అంటూ..అంతర్జాతీయ కథనాలు..
- ఇరాన్-చైనా ఒప్పందం చేసుకోవాలనుకున్నట్లు రాయిటర్స్ తన కథనం..

**టెహ్రాన్ (తెలుగోడు),మార్చి 5 :**

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఇటీవల దీటుగా బదులిస్తోంది. దాడుల్లో ఎక్కడా తగ్గడం లేదు. తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేపట్టింది. భారీ ఆయుధాలతో విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓవైపు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులే కాకుండా యూఏఈ, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి 10 దేశాలపై ఇరాన్ ఏకధాటిగా దాడిచేస్తున్న విధానాన్ని చూస్తే ఆ దేశం వద్ద భారీ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయనే సందేహం తలెత్తకమానదు. అయితే.. దశాబ్దాలుగా ఆ దేశం ఎంతో కృషిచేసి ఇంత భారీఎత్తున ఆయుధ సామగ్రిని నిర్మించుకుంది. మరి ఆ దేశం ఆయుధగారాన్ని పెంచుకోవడంలో చైనా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా స్పష్టమవుతోంది. ఆ మీడియా నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ముందే ఇరాన్‌కు చైనా ఆయుధాలను సరఫరా చేసినట్టు తెలుస్తోంది. వీటిలో ఆయుధాల్లో షాహిద్ క్లాస్ కామికేజ్ డ్రోన్ల నుంచి ఫత్తాహ్ క్లాస్ హైపర్‌సోనిక్ మిసైల్స్ వరకు ఇరాన్ భద్రతా వ్యూహంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి శత్రు దేశాలపై దాడిచేయగల సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉంటాయి. అయితే.. ఇరాన్ ఈ ఆయుధాలను అభివృద్ధి చేసుకోవడంలో చైనా పాత్ర ఎంతమేర ఉందనేదానిపై స్పష్టత లేదు. ఇక.. గత శుక్రవారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు దాడిచేసి.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ ఘటన తర్వాత ఇరాన్‌కు ప్రమాదకర ఆయుధాలను, అదనపు రక్షణ ఎలా పొందాలో చైనా వివరించిందని మధ్యప్రాచ్యంలోని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఇదిలా ఉండగా.. చైనా తయారుచేసిన సీఎం 302 యాంటీ షిప్ క్షిపణుల కొనుగోలుపై ఇరాన్-చైనా ఒప్పందం చేసుకోవాలనుకున్నట్టు రాయిటర్స్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఇరాన్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆయుధాలలో ఎక్కువ భాగం ఆ దేశంలోనే ఉత్పత్తి అయినవే అయినప్పటికీ.. 2లో

## దేశంలో పడిపోతున్న సంతానోత్పత్తి రేటు

- రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదు...
- 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు..
- ఫెర్టిలిటీ సమస్యలున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహం..
- పాపులేషన్ పాలసీపై డ్రాఫ్ట్ ప్రవేశ పెట్టిన సిఎం ..




**అమరావతి (తెలుగోడు),మార్చి 5 :**

జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో (మిగతా 2లో)

## వెలిగొండకు 30 ఏళ్లు

- అనేక కారణాలతో ఇప్పటికీ పూర్తి కాని ప్రాజెక్ట్..
- తానే శంకుస్థాపన చేసినట్లు చంద్రబాబు వెల్లడి..
- మళ్లీ తానే పూర్తి చేస్తానంటూ ఎక్స్ వేదికగా ప్రకటన...



**అమరావతి (తెలుగోడు),మార్చి 5 :**

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి నేటికి 30 ఏళ్లు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కీలక ప్రకటన చేశారు. 30 ఏళ్ల క్రితం 1996 మార్చి 5న తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేసిన రోజును గుర్తుచేస్తూ.. ఇప్పుడు పనులను పూర్తి చేసి నీటిని (మిగతా 2లో)

## పోలవరంపై భద్రతా సందేహాలు

- ముఖ్యమంత్రికి ఉండవల్లి అరుణ్ కుమార్ బహిరంగ లేఖ..
- నిర్మాణ రూపకల్పనలో వ్యత్యాసాలపై ఆందోళన..
- అనుమతులు పూర్తికాకముందే పనులపై ప్రశ్నలు..
- భవిష్యత్తులో ప్రమాదాలపై హెచ్చరిక..



**రాజమహేంద్రవరం (తెలుగోడు),మార్చి 5 :**

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు సాంకేతిక అంశాలను ప్రస్తావిస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. ప్రాజెక్టులోని రెండో గ్యాప్‌లో నిర్మిస్తున్న ఎర్త్ కోర్ రాక్ ఫిల్ డ్యామ్ రూపకల్పనలో ఉన్న వ్యత్యాసాలు, భద్రతాపరమైన ముప్పుల గురించి లేఖలో వివరించారు. కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అధికారం సంస్థ నివేదికలను పరిశీలించిన తర్వాతే ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తున్నట్లు ఆయన స్పష్టం (మిగతా 2లో)

## అమెరికా మరో దుస్సాహసం



- అణు వార్‌హెడ్ క్షిపణి పరీక్ష..
- శక్తివంతమైన మినిట్‌మ్యాన్-3 విజయవంతంగా ప్రయోగం...
- 20 రెట్లు శక్తివంతమైన వార్‌హెడ్‌లను మోయగల క్షిపణి ...
- రక్షణ వ్యవస్థలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు..

**వాషింగ్టన్ (తెలుగోడు), మార్చి 5 :**

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా భారీ అణు సామర్థ్యం గల క్షిపణి పరీక్ష నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికా సైన్యం కాలిఫోర్నియా తీరంలో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి శక్తిమంతమైన మినిట్‌మ్యాన్-3 ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ పరీక్షను అమెరికా సాధారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిందని అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి పరీక్ష సాంటా బార్బరా సమీపంలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నిర్వహించారు. ఈ ప్రయోగంలో నిరాయుధ రాకెట్‌ను ఉపయోగించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ప్రయోగించిన క్షిపణి పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ ఐస్ ల్యాండ్ సమీపంలోని లక్ష్యాన్ని కచ్చితంగా తాకినట్లు అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. మినిట్‌మ్యాన్-3 క్షిపణి అమెరికా రక్షణ వ్యవస్థలో కీలక భాగమని అధికారులు తెలిపారు. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమాపై పడేసిన అణుబాంబుల కంటే 20 రెట్లు శక్తివంతమైన వార్‌హెడ్‌లను మోయగల క్షిపణి అని అధికారులు చెబుతున్నారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ ప్రకారం.. ఈ (మిగతా 2లో)

## టెన్త్ విద్యార్థులకు శుభవార్త

## హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత ప్రయాణం

**అమరావతి (తెలుగోడు),మార్చి 5 :**

ఏపీలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టికెట్ చూపిస్తే.. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా వెసులుబాటు కల్పించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో విద్యార్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6.42 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలు జరిగే రోజుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని, తగినన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

## చట్టసభలను మత రాజకీయ వేదికగా చేస్తారా



- మండలి ఛైర్మన్‌ను మతం పేరుతో ప్రశ్నిస్తారా
- ఇప్పటికైనా లడ్డూ రాజకీయం మానండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**అమరావతి (తెలుగోడు),మార్చి 5 :**

లడ్డూ పేరుతో మతరాజకీయాలు చేసి రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించవద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. బుధవారం రాష్ట్ర శాసన మండలిలో లడ్డుపై జరిగిన చర్చ సందర్భంగా ఛైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి మీరు క్రిస్టియన్ అని సంబోధించడం ద్వారా చట్టసభలను మత రాజకీయాలమయం చేసి భ్రష్టు పట్టించటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దారుణంగా అవమానించడమేనని తెలిపారు. ఈ వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకొని భవిష్యత్‌లో మతాన్ని రాజకీయాలకు వాడుకోకుండా నిరోధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొద్దికాలంగా తిరుమల లడ్డు కల్తీ/అవినీతిపై జరుగుతున్న చర్చ సందర్భంగా ఉద్దేశ పూర్వకంగానే మత (మిగతా 2లో)

## అర్జున్ టెండూల్కర్ వివాహంలో లోకేశ్, బ్రాహ్మణి



**ముంబై (తెలుగోడు), మార్చి 5 :**

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణితో కలిసి హాజరయ్యారు. వీరిని సచిన్ టెండూల్కర్ కుటుంబం సాదరంగా స్వాగతించింది. అనంతరం.. ఈ కార్యక్రమానికి హాజరైన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీతో లోకేశ్, బ్రాహ్మణిలు మాట్లాడారు. వివాహ వేడుకలో పాల్గొనడం కోసం లోకేశ్ దంపతులు గురువారం ఉదయం ముంబైకి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ దంపతులు నవ వధూవరులైన అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌లను ఆశీర్వదించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు కూడా ఈవివాహ వేడుకకు హాజరయ్యారు. మాజీ క్రికెటర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు కలిసి ఈ వేడుకను మరింత వైభవంగా మార్చారు.

## విభజించిన జిల్లాల ప్రాతిపదికనే జడ్పీ ఎన్నికలు



**స్థానిక సంస్థల స్వావలంబనకు కట్టుబడి ఉన్నాం... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి...**

**అమరావతి (తెలుగోడు), మార్చి 5 :**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీ ఎన్నికలను విభజించిన జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు .. ఇందుకు అనుగుణంగా కసరత్తు జరుగుతోందని.. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీల పునర్విభజనపైనా న్యాయపరమైన అడ్డంకులు ఏవీ లేవని చెప్పారు. 'స్థానిక సంస్థల స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అసెంబ్లీ లో స్పష్టం చేశారు పవన్. అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలను బలోపేతం చేసే చర్యలను తీసుకున్నాం అన్నారు.. అలాగే రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం చెట్లను తొలగించేటప్పుడు అక్కడ ఎలాంటి ప్రత్యామ్నాయం తీసుకురావాలనే దానిపై పరిశీలన జరుపుతున్నాం అన్నారు.. పర్యావరణ ప్రేమికుడిగా ఈ విషయంలో అన్ని వైపులా ఆలోచించి పచ్చదనాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు.. కేవలం చర్యలు తీసుకోవడమే కాదు.. భవిష్యత్తులోనూ చెట్లను, వృక్షాలను సంరక్షించేలా బలమైన చట్టం తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నాం అన్నారు.. ఇది కఠినంగా అమలు చేస్తేనే పచ్చదనానికి భరోసా దొరుకుతుందన్నారు పవన్ కల్యాణ్. నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటుతున్నారు తప్పితే.. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు పవన్? సభ్యులు నా దృష్టికి తీసుకొచ్చారు.పచ్చదనం సంరక్షణకు సభ్యుల నిశిత దృష్టిని అభినందిస్తున్నాను. అదే విధంగా ఇక మీదట అటవీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసేవాటికి, నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ వేసే ప్రక్రియ అమలు చేయాలని భావిస్తున్నాం అన్నారు పవన్? నర్సరీల దగ్గర నుంచే దీనికి ప్రత్యేక వ్యవస్థను అమలు చేసేలా ఓ ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తాం. అన్నారు..

# ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25 వేలకు పెంచిన ఘనత ప్రభుత్వానిదే..**
**పంటల బీమాలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం ..**
**అరకు కాఫీ తోటల్లో 'కాఫీ బెర్రీ బోరర్' వ్యాధిపై తక్షణ చర్యలు..**
**రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు..**
**మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు..**



**అమరావతి, మార్చి 5:**
ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడం,అరకులో కాఫీ తోటల నష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి శాసన మండలిలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ స్థాయిలో పంట నష్టాన్ని వారం రోజుల్లో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, ఆ నివేదికల ఆధారంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ.12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అందించేసేవారని, 2014 లో తెదేపా ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ.12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ.25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ.370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబంధించి కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ.25 కోట్లు, రూ.34 కోట్లు, రూ.310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందజేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

***పంటల బీమా వ్యవస్థపై వివరణ..***
పంటల భీమా విషయంలో గత ప్రభుత్వ విధానం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనలో దేశంలోని అనేక రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పటికీ, గత ప్రభుత్వం ఉచిత భీమా పేరుతో వేరే విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రయత్నించిందని, కేంద్ర ప్రభుత్వం ఆ విధానం సాధ్యం కాదని సూచించిందని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఒక ఏడాది మాత్రమే రైతులకు భీమా అందించబడిందని, అనంతరం కేంద్రంతో కలిసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన సుమారు రూ.2000 కోట్లను మూడు సంవత్సరాల పాటు చెల్లించకపోవడంతో పోర్టల్ కూడా తెరవలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మళ్లీ పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

***అరకు కాఫీ తోటలపై వ్యాధి నియంత్రణ చర్యలు..***
అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం సుమారు 1.03 లక్షల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా, కేవలం 60.8 హెక్టార్లలో మాత్రమే ఈ వ్యాధి ప్రభావం కనిపించిందని తెలిపారు. సమస్య గుర్తించిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి శాస్త్రవేత్తలు, అధికారులు, కాఫీ బోర్డు ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ ప్రారంభించిందని చెప్పారు. వ్యాధికి గురైన 152 ఎకరాల్లోని 20,617 కిలోల కాఫీ కాయలను గుంతలు తవ్వి పాతిపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మంది కూలీలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ విద్యార్థులు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు తీసుకుంటుందని, ఎక్కడైనా వ్యాధి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని మంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

# విరుచుకుపడుతున్న ఇరాన్

(మొదటి పేజి (తరువాయి)
వాటిలో చాలావరకు చైనా పాత డిజైన్ల ఉత్పత్తులు లేదా చైనా తయారీ భాగాలపై ఆధారపడి ఇరాన్ రూపొందించుకుని ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. కొన్నేళ్లుగా ఇరాన్ ఆయుధగార నిర్మాణంలో చైనా కీలకంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశం సాయంలేకుండా.. ఇరాన్ ఇంత పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్ల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అసాధ్యమని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు. కాగా.. ఇరాన్‌కు1979–1989 కాలంలో తొలిసారి ఆయుధాలు సరఫరా చేసింది చైనా. పశ్చిమ దేశాలు విధించిన ఆయుధ నిషేధాల నడుమ 1986లో హై 2, సీ 801 యాంటీ షిప్ వ్యవస్థలను నాడు చైనా సరఫరా చేసింది. ఇరాన్‌కు చైనా అతిపెద్ద ఆయుధ సరఫరాదారుల్లో ఒకటని స్టాక్‌హోమ్ పీస్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. విమానాలు, క్షిపణులు, తుపాకీ వ్యవస్థలు సహా రక్షణ పరికరాలను అందించిందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. 2005లో ఇంటర్నేషనల్ ఆటోమిక్ ఎనర్జీ ఏజెన్సీ ఇరాన్ అణు వ్యాప్తి నిరోధక ఒప్పందం పాటించలేదనే కారణంగా ఇరాన్‌కు చైనా ఆయుధ సామగ్రి సరఫరాను నిలిపివేసింది. అమెరికా ఆంక్షలు చైనా ఆయుధ విక్రయాలను మరింత నియంత్రించాయి.

# రాజ్యసభకు నితీశ్ నామినేషన్

(మొదటి పేజి (తరువాయి)
నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీహార్ సీఎం పోస్టు రేసులో నిత్యానంద్ రాయ్‌తో సమ్రాట్ చౌదరీ ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.

# అమెరికా మరో దుస్సాహసం

(మొదటి పేజి (తరువాయి)
పరీక్ష పూర్తిగా రక్షణాత్మక ప్రయోజనాల కోసం నిర్వహించిందని అధికారులు తెలిపారు. క్షిపణి వ్యవస్థ కచ్చితత్వం, ప్రభావం, సిద్ధంగా ఉండే చర్యలను పరీక్షించడం ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. అలాగే వివిధ మిషన్ ప్రొఫైల్స్ ద్వారా మినిట్‌మ్యాన్–3 వ్యవస్థ పనితీరును మెరుగుపరచడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా భూమి ఆధారిత అణు దాడి వ్యవస్థ సిద్ధతను నిర్ధారించుకోవడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్‌పై దాడులు చేసిన నేపథ్యంలో ఈ క్షిపణి పరీక్ష జరగడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే ఈ పరీక్షకు ఆ ఘటనలతో ప్రత్యక్ష సంబంధం లేదని అమెరికా స్పష్టం చేసింది.

# వేసవి దృష్ట్యా 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

**ఢిల్లీ, మార్చి 5:**
రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తీసుకుంది...
దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఫుడ్ సెక్యూరిటీ కార్డుల సంఖ్య పెరిగింది. దాదాపు కోటికి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడ కోటా ఇవ్వాలని కేంద్రం సూచించడంతో ఆ మేరకు సరిపడా బియ్యం కోటా నిలువలు, సాధ్యాసాధ్యాలను తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తోంది.
ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేయాలని కేంద్రం యోచిస్తుండగా గత అనుభవాల దృష్ట్యా అనేక సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో ఒకే దఫా మూడు నెలల కోటాను పంపిణీ చేశారు. ఆ సమయంలో ఇటు లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయడం ద్వారా రవాణా ఛార్జీల ఖర్చు తగ్గనుండటంతోపాటు.. డీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశముంది. కానీ ఆ బియ్యం నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో అది డీలర్లకు సమస్యగా మారింది...
ఇక మూడు నెలలకు సంబంధించి మూడు ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉంది. దీనికి తోడు సర్వర్ సమస్యలతో ఒక్కో కార్డుకు దాదాపు 15–20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సమస్యలను అధికారులు పరిష్కరించాల్సి ఉంది.




# రాప్తాడు వైకాపా పరిశీలకుడిగా గువ్వల శ్రీకాంత్ రెడ్డి

**అమరావతి (తాడేపల్లి), మార్చి 5:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాప్తాడు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా గువ్వల శ్రీకాంత్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధినేత ఆదేశాలు: వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. అధికారిక ప్రకటన: తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం మాజీ జెడ్పిటిసి సభ్యులుగా వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి పనిచేస్తున్న, నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేయడం మరియు రాబోయే రాజకీయ సవాళ్లకు పార్టీని సిద్ధం చేయడం ఈ నియామకం ప్రధాన ఉద్దేశ్యం రాప్తాడు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను ఏకం చేస్తూ, స్థానిక సమస్యలపై పోరాడుతూ పార్టీని ముందుకు నడిపించడంలో శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నారు.

# టీ20 వరల్డ్ కప్.. ఫైనల్‌లోకి భారత్

**ముంబాయి, మార్చి 5:**
టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ అడుగు పెట్టింది. అందరూ ఊహించినట్లుగానే ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి, ఫైనల్స్ కు దూసుకు వెళ్ళింది సూర్య కుమార్ యాదవ్ సేన. ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ముంబై వేదికగా ఇంగ్లాండ్, భారత్ మధ్య ఉత్కంఠ భరితంగా సెమీ ఫైనల్ జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో చివరి క్షణంలో ఏడు పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. దీంతో ఇంగ్లాండ్ ఇంటి దారి పట్టగా, న్యూజిలాండ్‌తో ఫైనల్ ఆడేందుకు భారత్ సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన భారత్, ఇంగ్లీష్ బ్యాటర్ల ముందు 254 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అద్భుతంగానే ఇంగ్లాండ్ ఆటగాళ్లు రాణించారు. జాకబ్ బెథెల్ ఒక్కడే 48 బంతుల్లో 105 పరుగులు చేసి, భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. కానీ చివరలో అతడు కూడా చేతులెత్తేశాడు. దీంతో ఇండియా గెలిచింది.





టీ20 ప్రపంచ కప్ 2026 సెమీఫైనల్‌లో భారత్ 253 పరుగులు చేసి నాకౌట్ చరిత్రలోనే అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా నిలిచింది. 19 సిక్సర్లతో పాటు పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకుంది.
టీ20 ప్రపంచ కప్ 2026 రెండో సెమీఫైనల్‌లో భారత్ రికార్డుల పుస్తకాన్ని తిరగరాసింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్ బౌలర్లను దంచి కొట్టిన భారత బ్యాటర్లు, టీ20 క్రికెట్ చరిత్రలో పలు అరుదైన ఘనతలను సొంతం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ సాధించిన 253/7 స్కోరు, టీ20 ప్రపంచ కప్ నాకౌట్ (సెమీఫైనల్ లేదా ఫైనల్) చరిత్రలోనే అత్యధిక స్కోరుగా నిలిచింది. అంతకుముందు 2012 సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ చేసిన 205 పరుగులే అత్యధికంగా ఉండేది. టీ20 ప్రపంచ కప్ ఓవరాల్‌గా ఇది నాలుగో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు ఏకంగా 19 సిక్సర్లు బాదారు. టీ20 ప్రపంచ కప్ ఇన్నింగ్స్‌లో ఒక జట్టు బాదిన అత్యధిక సిక్సర్ల రికార్డును (19) భారత్ సమం చేసింది. గతంలో నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లు మాత్రమే ఈ ఘనత సాధించాయి. అంతేకాకుండా, ఒకే ఎడిషన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన జట్టుగా (88 సిక్సర్లు) భారత్ తన రికార్డును మరింత మెరుగుపరుచుకుంది.

భారత జట్టు కేవలం 8.3 ఓవర్లలోనే 100 పరుగుల మార్కును చేరుకుంది. టీ20 ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఒక జట్టుకు ఇది రెండో వేగవంతమైన వంద పరుగులు. నిన్న జరిగిన సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ 7.5 ఓవర్లలోనే వంద పరుగులు చేసి మొదటి స్థానంలో ఉంది. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ రెండో వికెట్‌కు నెలకొల్పిన 97 పరుగుల భాగస్వామ్యం, టీ20 వరల్డ్ కప్ నాకౌట్లలో భారత్‌కు అత్యధిక భాగస్వామ్యంగా నిలిచింది.
సంజూ శాంసన్: 89 పరుగులు చేసిన సంజూ, టీ20 ప్రపంచ కప్ నాకౌట్లలో అత్యధిక స్కోరు చేసిన భారత బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ (89బి) రికార్డును సమం చేశాడు. శివం దూబే: ఒకే టీ20 ప్రపంచ కప్ ఎడిషన్‌లో మూడు సార్లు రనౌట్ అయిన రెండో బ్యాటర్‌గా ఎంఎస్ ధోనీ తర్వాత దూబే నిలిచాడు. అదిల్ రషీద్: టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 200 సిక్సర్లు సమర్పించుకున్న మొదటి బౌలర్‌గా ఇంగ్లాండ్ స్పిన్నర్ రషీద్ రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మొత్తం 37 బౌండరీలు (18 ఫోర్లు, 19 సిక్సర్లు) సాధించింది. టీ20 ప్రపంచ కప్ ఇన్నింగ్స్‌లో ఇది రెండో అత్యధిక బౌండరీల కౌంట్. 2007లో కెన్యాపై శ్రీలంక సాధించిన 41 బౌండరీల రికార్డు ఇప్పటికీ మొదటి స్థానంలో ఉంది. భారత జట్టు తన ఇన్నింగ్స్‌లో ప్రతి 10.8 బంతులకు ఒక సిక్సర్ బాదుతూ ఈ టోర్నీలోనే అత్యంత ప్రమాదకరమైన జట్టుగా అవతరించింది.

***భారత్ ఫైనల్‌కు వెళ్లడం వెనుక చక్రం తిప్పిన ధోని***
టీ20 వరల్డ్ కప్ లో భారత్ ఫైనల్ కు చేరిన నేపథ్యంలో మహేంద్ర ధోని పేరు మారుమోగుతోంది. అతడు చక్రం తిప్పడం కారణంగానే ఫైనల్స్ దాకా భారత్ చేరిందని సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెడుతున్నారు ధోని అభిమానులు. ఇంగ్లాండ్, భారత్ మధ్య జరిగిన సెమీ ఫైనల్ చూసేందుకు ధోని ముంబై స్టేడియానికి వచ్చాడు. మ్యాచ్ పూర్తయ్యే వరకు తన భార్య సాక్షితో గ్రౌండ్ లోనే ఉన్నాడు మహేంద్ర సింగ్ ధోని. అలాగే ఇన్నింగ్స్ గ్యాప్ సమయంలో, భారత డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లి కీలక సూచనలు చేశాడని ప్రచారం చేస్తున్నారు. అందువల్లే ఫైనల్స్ దాకా భారత్ దూసుకు వెళ్లిందని ధోని అభిమానులు పోస్టులు పెట్టడం మొదలు పెట్టారు. అటు తెలుగు కామెంట్రీ చేసే తిరుమల శెట్టి సుమన్ కూడా ధోని వల్లే ఇండియా గెలిచిందని పేర్కొన్నారు. అయితే ఇదంతా నచ్చని వాళ్ళు కౌంటర్లు కూడా పేల్చుతున్నారు. ధోని భజన షురూ చేశారని రివర్స్ అటాక్ చేస్తున్నారు.

**స్కోర్లు:**
**భారత్ – 253/7 (20 ఓవర్లు)**
**ఇంగ్లండ్ – 246/7 (20 ఓవర్లు)**



# పడిపోతున్న సంతానోత్పత్తి రేటు

(మొదటి పేజి (తరువాయి)
ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్(ఎ÷ఎఈ) సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 10 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు. 2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటరింగ్‌లో భాగం చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కు ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# పోలవరంపై భద్రతా సందేహాలు

(మొదటి పేజి (తరువాయి)
చేశారు.పూర్తి సాంకేతిక అనుమతులు, రూపకల్పన ఆమోదాలు లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఉండవల్లి పేర్కొన్నారు. ఇలా కొనసాగితే డ్యామ్ బలానికి, ప్రజల భద్రతకు ముప్పు కలగవచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం నిర్మాణం నది మట్టం కంటే సుమారు 7.18 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.డ్యామ్ కింద నిర్మిస్తున్న డయాఫ్రమ్ గోడ నీటి చొరబాటును అడ్డుకోవడానికే ఉపయోగపడుతుందని, అది డ్యామ్‌కు పునాది కాదని ఉండవల్లి వివరించారు. పునాది భాగంలో లోపాలు ఉంటే భవిష్యత్తులో ఇసుక కోత ఏర్పడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.టెయిల్ వాటర్ స్థాయిని ఎటువంటి సరైన కారణం లేకుండా ం25 మీటర్ల నుంచి ం16.0 లేదా ం13.5 మీటర్లకు మార్చిన విషయంపై కేంద్ర జల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ మార్పులు ప్రాజెక్టు భద్రతపై ప్రభావం చూపే అవకాశముందని పేర్కొన్నారు.అంతర్జాతీయ సలహా సంస్థ నుండి రావాల్సిన వడపోత రూపకల్పన, వంపు స్థిరత్వం వంటి కీలక పత్రాలు ఇంకా కేంద్ర జల సంఘానికి అందలేదని ఉండవల్లి లేఖలో పేర్కొన్నారు. ఈ పత్రాలు లేకుండానే పనులు కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.భూకంపాలను తట్టుకునే సామర్థ్యానికి సంబంధించి పాత ప్రమాణాలు, కొత్త ప్రమాణాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని కూడా ఉండవల్లి సూచించారు. వీటిని సరిచేయకపోతే భవిష్యత్తులో సరిదిద్దలేని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పోలవరం వంటి కీలక ప్రాజెక్టులో అన్ని సాంకేతిక అంశాలను పూర్తిగా పరిశీలించి జాగ్రత్తగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రిని కోరారు.

# చట్టసభలను రాజకీయ వేదికగా చేస్తారా..

(మొదటి పేజి (తరువాయి)
రాజకీయాలను చొప్పిస్తున్నారని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా వారిపై చర్య తీసుకోకుండా వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేయడం గర్హనీయమని తెలిపారు. ఇందుకు అధికార పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షమూ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలను నిరసించాల్సిందిగా రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సిట్ నివేదిక బయట పెట్టకుండా శాసనమండలి సభ్యులకు ఒకనోటు అందించడం ద్వారా వాస్తవాలను తొక్కిపెట్టాలన్న దుర్బుద్ధి కనిపిస్తోందని తెలిపారు. ఆ నివేదికను బట్టబయలు చేసి దాని ఆధారంగా అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. లడ్డు నాణ్యత తగ్గడానికి, అవినీతికి ఇప్పటివరకు రాష్ట్రాన్ని పాలించిన పార్టీల ప్రభుత్వాలదే బాధ్యతని పేర్కొన్నారు. ఏ చర్యలూ తీసుకోకుండా ప్రజల విశ్వాసాలతో రాజకీయాలు చేయాలనుకోవడం తీవ్రమైన నేరమని, ఇప్పటికైనా ఇలాంటి మత విద్వేష రాజకీయాలను మానుకొని అధికార కూటమి అభివద్ధి, ప్రజా సంక్షేమం, తక్షణ సమస్యల పరిష్కారంపై దష్టి పెట్టాలని డిమాండు చేశారు.

# వెలిగొండకు 30 ఏళ్లు

(మొదటి పేజి (తరువాయి)
అందించే అవకాశం తనకే వచ్చిందని సీఎం పేర్కొన్నారు. 1996 మార్చి 5.... ఆ రోజు తనకు ఇంకా గుర్తుందన్నారు సీఎం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతాల్లో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే.. వారి కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం తొలి అడుగు వేశామని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో.. జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని వినియోగించుకునే ఆలోచనతో 30 ఏళ్ల క్రితం ఇదే రోజున అంటే 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తాను వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. అనేక కారణాలతో తరువాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలైన వెలిగొండ పనులను మళ్లీ 2014–19 మధ్య వేగవంతం చేశామన్నారు సీఎం. ప్రాజెక్ట్ కోసం రూ.1,414 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. అయితే తరువాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం పేరుతో ప్రజలను మోసం చేసి నవ్వులపాలు అయ్యిందని సీఎం అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. రూ.140 కోట్లతో పెండింగ్ బిల్లులు క్లియర్ చేశామని, రూ.585 కోట్లు నిర్మాణంపై ఖర్చు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని అన్నారు .రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది జులై నాటికి తొలి ఫేజ్ పనులు పూర్తి చేసి వెలిగొండకు కృష్ణా నీళ్లు తీసుకొస్తామని స్పష్టం చేశారు. 2027–28 నాటికి ఫేజ్–2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. దశాబ్దాల కలను నిజం చేసి, కరువు ప్రాంతంలో ప్రతీ ఎకరానికి నీళ్లిచ్చి రైతన్న జీవితాలు మారుస్తామని.. హార్టికల్చర్ సాగుతో జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. 'వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే' అని సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం పలు శుభకార్యాలకు హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో వీఆర్ శ్రీనివాస్ కుమారుడి వివాహానికి సీఎం హాజరయ్యారు. వధూవరులు వేంకటరామానుజ జశ్వంత్, తారక రస్యకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫయాజ్ బాషా

# రంజాన్ కానుకగా ఇమామ్, మౌజన్‌లకు నగదు పంపిణీ

*రూ. 3,30,000 నగదు వితరణ.. మైనారిటీ నేత ఫయజ్ బాషా ..*

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 5 :**
పవిత్ర రంజాన్ మాసం పునస్కరించుకొని గురువారం ఫయాజ్ భాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో తాడిపత్రిలోని 33 మసీదుల ఇమామ్, మౌజన్‌లకు రంజాన్ కానుకగా హిరాపురం ఫయాజ్ బాషా 3,30,000 రూపాయల నగదును కానుకగా అందజేశారు. స్థానిక పడమటి గేరిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హిరాపురం ఫయాజ్ భాషా నివాసంలో ఫయాజ్ బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 33 మంది ఇమామ్ లకు 6000, 33 మంది మౌజన్ లకు 3500 చొప్పున 3,30,000 నగదు నగదును రంజాన్ కానుకగా హిరాపురం ఫయాజ్ భాషా అందజేశారు. ఈ సందర్భంగా ఫయాజ్ బాషా ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్ బాషా మాట్లాడుతూ ట్రస్టు ద్వారా పేద ప్రజల కొరకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామన్నారు. ఉచితంగా రక్త పరీక్ష ల్యాబ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 232 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. టీబీ పేషెంట్లకు పౌష్టిత ఆహార కిట్లు అందజేస్తున్నామని, మరెన్నో సేవా కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా చేశామని తెలిపారు. పేద ప్రజల సేవ చేయడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఖాజీ సయ్యద్ హయత్ బాషా ఖాద్రీ మాట్లాడుతూ ఫయాజ్ బాషా ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత గురువులు, 33 మసీదుల ఇమామ్, మౌజన్ లు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



రంజాన్ కానుక అందజేస్తున్న ఫయాజ్ బాషా

# 8న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్యశిబిరం

*డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు.. అధ్యక్షులు రఘువీర్ రావు..*





**పామిడి (తెలుగోడు), మార్చి 5 :**
శ్రీ భావసార క్షత్రియ కళ్యాణ మండపం నందు ఈనెల 8వ తేది ఆదివారం ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షులు రఘువీర్ రావు గురువారం తెలిపారు. బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి వైద్యనిపుణులు కంటిచూపు మందగించిన వారిని పరీక్షించి మందులను అందజేస్తూ అవసరమైతే ఆపరేషన్లకు రెఫర్ చేసి అసుపత్రి వారే ప్రత్యేక బస్సుల్లో బెంగుళూరుకు తీసుకెళ్ళి ఆపరేషన్ల అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని తెలియజేశారు. కంటి వైద్యశిభిరానికి హాజరయ్యే వారు ఆదారుకార్డు జిరాక్స్ రెండు పాసుపోర్టుసైజు ఫోటోలు తీసుకుని రావాలని తెలియజేస్తూ మండల ప్రజలు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్ రావు కోరారు.

# సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నేటి నుండి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

*7న అవార్డుల ప్రధానోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు.. కరస్పాండెంట్ మారెన్న..*

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 5 :**
బెళుగుప్పలోని సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం నుంచి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ( సైన్స్ ఇన్నోవేషన్ ) నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారెన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ తరగతి గదిలో మొలకెత్తిన ఓ చిన్న అంశమే ప్రపంచ గమనాన్ని శాస్త్రం దిశగా దూసుకెళ్లేలా చేస్తుందన్నడంలో అతిశయోక్తి లేదు.దేశ ప్రగతి ఆర్థిక అభివృద్ధి, ఆహారం, ఆరోగ్యం, అవసరాలకు నూతన ఆవిష్కరణలకు అద్దం పట్టేదే వైజ్ఞానిక రంగం. పిల్లల్లో చిన్ననాటి నుండే విద్యా వైజ్ఞానిక నైపుణ్యాన్ని పెంపొందించి వారి ఆలోచనను పదును చేయాలనే లక్ష్యంతో సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం 2015 నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థుల చేత ఉపాధ్యాయుల సహకారంతో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా నేటి నుంచి విద్య వైజ్ఞానిక ప్రదర్శన ( సైన్స్ ఇన్నోవేషన్ ) నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మరుసటి రోజు శనివారం విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం, విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కావున తల్లిదండ్రులు, నాయకులు, అధికారులు,మేధావులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు విద్యార్థులు మా చిన్నారులు తయారుచేసిన సైన్స్ నమూనా ప్రదర్శనలను తిలకించి తగిన సలహాలతో విద్యార్థులను ప్రోత్సహించగలరని పాఠశాల కరస్పాండెంట్ మారెన్న కోరారు..



మాట్లాడుతున్న పాఠశాల కరెస్పాండంట్ మారెన్న



సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల

# జిల్లా సైన్స్ సెంటర్ వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్ ఆవిష్కరణ

## విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్‌కు ప్రశంసలు..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 5 :**
అనంతపురం నగరంలోని జిల్లా సైన్స్ సెంటర్‌కు విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్ రూపొందించిన వెబ్‌సైట్ , ఆండ్రాయిడ్ యాప్‌ను గురువారం అగస్త్య ఫౌండేషన్ సిఈఓ పుష్ప, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగస్త్య ఫౌండేషన్ సిఈఓ పుష్ప మాట్లాడుతూ తాడిపత్రిలోని సర్ సి.వి. రామన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సి.ఎస్.సి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్ జిల్లా సైన్స్ సెంటర్ కోసం వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్ నిర్మించడం గర్వకారణమన్నారు. తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సెన్స్ సెంటర్ కోసం వెబ్‌సైట్,ఆండ్రాయిడ్ యాప్ చేసిన విధంగా, విద్యార్థుల్లో నూతన ఆలోచనలు ఉంటే జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాల మురళీకృష్ణను కలవాలని, ఆయన విద్యార్థులలోని విభిన్న ఆలోచనలను కార్యరూపం దాల్చేలా ప్రోత్సహిస్తారని తెలిపారు.



ఆండ్రాయిడ్ యాప్ అందించిన విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్



ఆండ్రాయిడ్ యాప్ లాంచ్ చేస్తున్న దృశ్యం

జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు మాట్లాడుతూ చాంద్ హాఫీజ్ నవాజ్ ఆలోచనా విధానం చాలా బాగుందని, తన సమయాన్ని వెచ్చించి గొప్ప పని చేశాడని అభినందించారు. జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాల మురళీకృష్ణ మాట్లాడుతూ చాంద్ హాఫీజ్ నవాజ్ తరచుగా సైన్స్ సెంటర్‌కు వచ్చేవాడని, విద్యార్థిలోని ఆసక్తిని గమనించి ఈ ప్రాజెక్ట్‌ను అప్పగించామని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, ఉచితంగా చేసి ఇచ్చాడని, ఈ ప్రాజెక్ట్ అనుకున్న దానికంటే ఎంతో మెరుగ్గా తీర్చిదిద్దాడని ప్రశంసించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, అనంతపురం సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జాతీయ సైన్స్ డే-2026 వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సి.ఈ.ఓ హాఫీజ్ బాషా మాట్లాడుతూ విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్ సైన్స్ సెంటర్‌కు వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్ అందించడం గర్వకారణమన్నారు. ఇతర విద్యార్థులు కూడా చాంద్ హాఫీజ్ నవాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం సి.ఈ.ఓ హాఫీజ్ బాషా విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్‌కు మెమెంటో అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి నరసింహ రెడ్డి, ఆలెస్కో రామచంద్ర, సమీరా, జిల్లాలోని 31 మండలాల ప్రభుత్వ సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



చాంద్ హాఫీజ్ నవాజ్‌కు మెమెంటో అందజేస్తున్న సిఈఓ హాఫీజ్ బాషా

# పామిడి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

## రూ.25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ రిజిష్టార్ రాధారమణ, సహాయకుడు వెంకటేష్.. డిఎస్పీ ప్రసాద్ రెడ్డి..

**పామిడి (తెలుగోడు), మార్చి 5 :**
పామిడి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు చేశారు. పామిడికి చెందిన జుల్ ఫక్రుల్ తన ఇంటికి సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం సబ్-రిజిస్ట్రార్ రాధారమణ రూ.25 వేలు డిమాండ్ చేయటంతో అనంతపురం ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని డిఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్ తెలిపారు. సబ్-రిజిస్ట్రార్ రాధారమణ, అసిస్టెంట్ చిన్న అలియాస్ వెంకటేష్ జుల్ ఫక్రుల్ నుంచి డబ్బులు తీసుకుంటుండగా సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సబ్-రిజిస్ట్రార్ రాధారమణ, ఆయన అసిస్టెంట్ చిన్న అలియాస్ వెంకటేష్ పై కేసు నమోదు చేశామన్నారు. రికార్డులను పరిశీలిస్తున్నామని, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు చెయ్యాల్సిన పనులకు లంచం తీసుకోవటం చట్టరీత్యా నేరం అని, ఎక్కడైనా అవినీతి జరుగుచున్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే వాటిని అరికట్టి అధికారులపై కేసు నమోదు చేసి చర్యలు చేపడుతామని డిఎస్పీ ప్రసాద్ రెడ్డి వెల్లడించారు.



లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుపడ్డ సబ్-రిజిస్ట్రార్ రాధారమణ






వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్

# యాడికి ఆసుపత్రిలో ఈహెచ్ఆర్ అమలు పరిశీలన

## అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్.

**యాడికి (తెలుగోడు), మార్చి 5 :**
యాడికి ప్రభుత్వ వైద్యశాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్ఆర్) అమలు సాధ్యాసాధ్యాలపై ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ గురువారం పరిశీలించారు. ఈహెచ్ఆర్ అమలుకు యాడికి ప్రభుత్వ వైద్యశాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. ఈహెచ్ఆర్ ఎంతవరకు అమలుచేయవచ్చు, దీనిపై అవగాహణ చర్యలు అమలులో అవరోధాలు వంటి విషయాలను చర్చించారు. ఈహెచ్ఆర్ అమలైతే ప్రతి రోగికి ఒక ఐడీనెంబర్ కేటాయింపు, కేస్ స్టడీ లాంటి అన్ని వివరాలు అందులో నమోదుచేస్తారు. చికిత్స కోసం రాష్ట్రంలోని ఏ వైద్యశాలకు వెళ్లినా పేషంట్ వివరాలు, రోగాలు గతంలో తీసుకున్న వైద్య చికిత్స లాంటి వివరాలన్ని ఇందులో నమోదై ఉంటాయి. పైలెట్ ప్రాజెక్ట్ ఎంపికైన యాడికి ప్రభుత్వ వైద్యశాలలో ఈహెచ్ఆర్ అమలు అయితే రోగులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్. వైద్యాధికారి పరమేష్. సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.




యాడికి ప్రభుత్వ వైద్యశాలలో ఈఎన్ఆర్ అమలుపై డాక్టర్‌ను విచారిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్

# కుష్టువ్యాధి నిర్మూలన , స్పర్శపై విద్యార్థులకు అవగాహన

## పెద్దవడుగూరు ఆరోగ్య కేంద్రం రికార్డులు తనిఖీ.. జిల్లా కుష్టువ్యాధి. క్షయ. ఎయిడ్స్ అధికారిణి బోయ జయలక్ష్మి.

**యాడికి (తెలుగోడు), మార్చి 5 :**
పెద్దవడుగూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను గురువారం కుష్టువ్యాధి. క్షయ, ఎయిడ్స్ అధికారిణి జయలక్ష్మి అకస్మాత్తుగా తనిఖీ చేశారు. గ్రామాలలో కుష్టు వ్యాధి అనుమానం ఉన్న, క్షయ ఎయిడ్స్ అనుమానితులను గుర్తించి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని సిబ్బంది సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టువ్యాధి నిర్మూలన, క్షయ ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కనురెప్పలు రాలిపోవటం, కాళ్ళకు చెప్పులు జారిపోవటం, చేతులతో వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవటం కుష్టు వ్యాధి లక్షణాలు అన్నారు. కుష్టువ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. వైద్యసేవలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలని అలా అనుమానం ఉన్న వారు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షించుకోవాలని అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టి క్షయ ఎయిడ్స్ వ్యాధి అధికారి బోయ జయలక్ష్మి. పెద్దవడుగూరు వైద్యాధికారి పుష్పలత. డాక్టర్ సునీత . ఎం పి ఓ నాగన్న. డిపిఎమ్ఓ రామచంద్ర. సూపర్వైజర్ శ్రీనివాసులు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్.ఏఎన్ఎంలు. ఆశా కార్యకర్తలు. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దవడుగూడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న కుష్టు క్షయ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అధికారిణి బోయ జయలక్ష్మి





పెద్దవడుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కలిగిస్తున్న జిల్లా అధికారిణి బోయ జయలక్ష్మి.



అలంకరణలో షిరిడి సాయిబాబా

# ఘనంగా షిరిడీ సాయి బాబా మందిరం 26వ వార్షికోత్సవ

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 5 :**
వేమన భవన్ వద్ద ఉన్న మన షిరిడీ సాయి బాబా మందిరంలో 26వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడ హారతి అభిషేకాలు విశేష అలంకరణ, పూజలు భజనలు హారతి పాటలతో ఆధ్యాత్మికత సంతరించుకుంది . మధ్యాహ్నం హారతి అనంతరం నారాయణ సేవ లో మందిరం అధ్యక్షులు జయచంద్ర చౌదరి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నాగానందం, రవీంద్రనాథ్, శ్రీరాములు, వెంకటనారాయణ, వేంకటగిరి, రవిప్రకాష్ ప్రసాద వితరణ చేశారు సుమారు 1200 మంది భక్తాదులకు అన్న ప్రసాదం అందించారు.



విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకుంటున్న జేసీ దంపతులు

# విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్న జేసీ దంపతులు

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 5 :**
నవిజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారిని తాడిపత్రి మాజీ శాసనసభ్యులు, మునిసిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ ఉమా రెడ్డి దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

# కష్టపడి పనిచేసే వారికి టిడిపిలో గుర్తింపు తధ్యం

**విజయవాడ (తెలుగోడు), మార్చి 5 :**
కష్టపడి పనిచేసే వారికి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు తధ్యం అని టిఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, విజయవాడ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల మాధవ్ అన్నారు. టిడిపి అనుబంధ టిఎన్‌టీయూసీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఇటీవల ఏపీ మినియం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన రెంటపల్లి శ్యామ్‌కు టిఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పశ్చిమ నియోజకర్గంలో ఉన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాల మాధవ్ ముందుగా నూతనంగా రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్‌గా నియమితులైన శ్యామ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు టిడిపి పార్టీలోనే సాధ్యమన్నారు. టిఎన్‌టీయూసీలో బాధ్యతాయుంతంగా పనిచేస్తూ కార్మికుల సంక్షేమం దిశగా కష్టపడి పనిచేసిన శ్యామ్‌కు పార్టీ నాయకత్వం పదవిని అప్పగించడం జరిగిందని వివరించారు.

తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకత్వంకు శ్యామ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొట్టేటి హనుమంతరావు, కామా దేవరాజ్, టీఎన్‌టీయూసీ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు బాస్కర్, పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పైడిమాల సుభాషిణి, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీవీ నరసింహారావు, విజయవాడ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మైలపల్లి రాజు, నాయకులు చిల్లా వెంకటేష్, పద్మ, రాజు, సీతారామయ్య, విజయ్ లతో పాట తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏ.పీ.ఎం. ముత్యాలప్ప

## ఎఫ్. పి. జి. సభ్యులకు శిక్షణ

**అమరాపురం (తెలుగోడు), మార్చి 5 :**
అమరాపురం హేమ మండల కార్యాలయంలో గురువారం ఎఫ్ పీ జి సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఏపీఎం ముత్యాలప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏ.పీ. ఎం. ముత్యాలప్ప మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ సంఘాల ద్వారా ఎఫ్ పి జి. సభ్యులు ఇన్పుట్ బిజినెస్, అవుట్ పుట్ బిజినెస్, ఐ. ఎఫ్. సి. క్లస్టర్ లో జరిగే విషయాల గురించి వివరించారు. రైతులు వ్యాపారుల సహకారంతో వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ జి. ఓ. అధ్యక్షురాలు దేవమ్మ కోశాధికారి కళావతి, సి. ఆర్. పి. లు, సీ.సీ.లు, అకౌంటెంట్, ఎఫ్. పి.జి. సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టంతో కాకుండా ఇష్టంగా చదవండి

***ఒత్తిడికి గురికాకుండా చదివితే విజయం మీ వెంటే...***
***ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు***

**అగళి (తెలుగోడు), మార్చి 5 :**
పరీక్షల కాలం దగ్గర పడుతోందని, ప్రతి ఒక్క విద్యార్థిని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే విజయం మీ వెంటే ఉంటుందని, ముఖ్యంగా పరీక్షల సన్నద్ధంలో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా చదవాలని మండల విద్యార్థులకు ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రతి ఒక్కరూ బాగాచదవాలని పరీక్షలకు,సన్నద్ధం అయ్యే సమయంలో ఒత్తిడికి గురికాకూడదని అన్నారు. ఒత్తిడికి గురైతే చదువుకున్నది కూడా మర్చిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. ఇష్టంతో చదివితే ఎంతటి కష్టమైన సబ్జెక్టును కూడా అర్థం చేసుకొని విజయం సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా విద్యతోపాటు,భోజన వసతి,ప్రతి ఒక్కటి విద్యార్థులకు ఉచితంగా అందించి మంచి విద్యను అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి కూడా ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





శిక్షణ తరగతుల్లో పాల్గొన్న క్లస్టర్ ఇంచార్జ్ మంజునాథ్ తదితరులు

## శిక్షణ తరగతుల్లో పాల్గొన్న క్లస్టర్ ఇంచార్జులు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 5 :**
మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మడకశిర నియోజకవర్గంలోని మడకశిర గుడిబండ రొళ్ల అగళి అమరాపురం మండలాలకు చెందిన క్లస్టర్ కన్వీనర్ లు శిక్షణ తరగతులకు హాజరైనారు. కన్వీనర్ లు, మండల ప్రధాన కార్యదర్శులకు ఇదివరకే శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఐదు మండలంలోని క్లస్టర్ ఇంచార్జ్ లకు మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్రకార్యాలయంలో శిక్షణ కల్పించారు. ఈ శిక్షణ తరగతుల్లో రొళ్ల మండలం కొత్తపాళ్యం నుంచి మంజునాథ్ గుడిబండ మండలం నుంచి బాలేపల్లి రాజు, అమరాపురం మండలం నుంచి నవీన్ కుమార్, మడకశిర నుంచి మురళి బాబు,ఆగళి మండలం నుంచి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వం చేపట్టుతున్న సంక్షేమ పథకాలను ప్రజాల్లోకి ఎలా తీసుకొని వెళ్లే విషయాలపై శిక్షణ కల్పించారు.

## వన్నారనహళ్ళి ప్రాథమిక పాఠశాల సందర్శన

***ఎం ఇ ఓ శ్రీధర్..***

**రొళ్ల (తెలుగోడు), మార్చి 5 :**
మండలంలోని వన్నారనహళ్ళి ప్రాథమిక పాఠశాలను గురువారం ఎం ఇ ఓ శ్రీధర్ సందర్శించారు. విద్యార్థులు రాసిన అసెస్మెంట్ పుస్తకాలను, ఎఫ్ ఎల్ ఎన్ రిజిస్టర్లు, విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, ఎం డి యం, గుడ్లు చిక్కిల రిజిస్టర్ల ను తనిఖీ చేశారు. చాలా పాఠశాలలో వర్క్ పుస్తకాలను పూర్తిగా రాయించలేదు దిద్దలేదని వారం లోపు వర్కు పుస్తకాలు రాయించి దిద్దాలన్నారు. కేజీబీవీ లో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఇంగ్లీష్ గ్రాండ్ టెస్ట్ ను , 9వ తరగతి వారికి సమ్మేటివ్ 2 పరీక్షలను పరిశీలించారు.



గ్రేడ్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న ఎం ఇ ఓ శ్రీధర్

# కాటికోటేశ్వర క్షేత్రంలో భక్తుల కోలాహలం

### ముగిసిన బ్రహ్మోత్సవాలు.. కనుల పండువగా రథపదక్షిణలు.. మొక్కులు తీర్చుకున్న వేలాదిమంది భక్తులు ..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 5 :**
మండలంలోని సంజీవపురం సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాటి కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం నుంచే భక్తులు భారీగా తరలిరావడంతో క్షేత్రం జనసంద్రమైంది. శివనామ స్మరణలతో కొండ ప్రాంతం మొత్తం మార్మోగింది. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన లంకాదహనం బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు భక్తుల హర్షధ్వానాల మధ్య కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంతో ఉత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. నాలుగవ రోజైన గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన రథ ప్రదక్షిణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు తమ మొక్కుబడుల మేరకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి కొండ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి బియ్యం, నారికేళాలు, కానుకలు సమర్పించి భక్తి చాటుకున్నారు.

***ఈదుల ముష్టురుకు చేరిన ప్రభ..***
సాయంత్రం 7 గంటలకు స్వామివారి మూలస్థానమైన ఈదుల ముష్టూరు గ్రామానికి క్షేత్రం నుండి ప్రభను ఊరేగింపుగా తరలించారు. గ్రామంలో ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మారుపూజలు, జంతుబలుల సమర్పణతో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు అధికారికంగా ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

***సేవా కార్యక్రమాలు - భక్తుల రద్దీ..***
ఉత్సవాల సందర్భంగా నాలుగు రోజుల పాటు దాతల సహకారంతో



బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష పూజలు అందుకుంటున్న శ్రీ కాటికోటేశ్వరుడు

భక్తులకు నిరంతర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రంలో ఏర్పాటు చేసిన మిఠాయిలు, బొమ్మలు, గాజుల దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి.

***పోలీసుల భద్రతా ఏర్పాట్లు..***
భక్తుల రద్దీ దృష్ట్యా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జేబు దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అర్చకులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.





శ్రీ కాటి కోటేశ్వర బ్రహ్మోత్సవాలను తిలకించడానికి వచ్చిన ప్రజలు. క్షేత్రంలో ఊరేగుతున్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి వారి ప్రభ

# సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతాం

### ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్యమ్మ..

**గుడిబండ (తెలుగోడు), మార్చి 5 :**
ఆశ వర్కర్ల సమస్యల పరిష్కరించేంతవరకు ప్రభుత్వంతో పోరాడుతూ ఉంటామని శ్రీ సత్యసాయి జిల్లా ఆశ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర సిఐటియు నాయకత్వం పిలుపుమేరకు విజయవాడలో ఆశ వర్కర్లు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విచ్చేసిన ఆశ వర్కర్లు కనీస వేతనం పెంచాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి, తమ హక్కుల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలి తదితర నినాదాలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌభాగ్యము మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్లకు చాలిచాలినంత జీతాలు అందించి వెట్టి చాకిరి పనులు చేయిస్తుందని తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో నిరాంతంగా పోరాడుతూనే ఉన్నామని ఆ ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఎలాంటి సౌకర్యం కల్పించలేదని అలాగే ఈ



మహాధర్నాలో పాల్గొన్న ఆశ వర్కర్లు




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్యమ్మ

ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు ఆయన తమ హక్కుల సాధన కోసం మేము డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం మమ్ములను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతాయి తప్ప తమ సమస్యల మీద ఎవరు మాట్లాడడం లేదు అన్నారు. గ్రామంలో ఎల్లవేళలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గర్భిణి బాలింతలకు చిన్నారులకు ఇమ్మునైజేషన్ కార్యక్రమం, ప్రతి ఇంట సర్వే నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వారికి వైద్య చికిత్సలు అందించే విధముగా చూస్తున్నామని అయితే ప్రభుత్వం మాకు కనీసం వేతనం పెంచక కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు మాకు అందించాలని, ఏఎన్ఎం జిఎన్ఎమ్ చేసుకున్న ఆశ వర్కర్లకు పదోన్నతి కల్పించాలని, నాణ్యమైన 5జి ఫోన్లను ఇవ్వాలని, పదవి విరమణ సమయంలో మాకు ఆర్థిక సాయం అందించాలని, 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల ప్రతినిధులు మహాలక్ష్మి అంజమ్మ జిల్లా వ్యాప్తంగా ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన మండల టిడిపి నాయకులు ..

**అగళి (తెలుగోడు), మార్చి 5 :**
టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి జన్మదినం సందర్భంగా వారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు నాయకులు చేరి మొదట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం జడ్పిటిసి ఉమేష్,కన్వీనర్ తిప్పేస్వామి ఆధ్వర్యం లో డాక్టర్ శ్రీనివాస్ మూర్తి వీరాభిమాని శిష్యుడు వెంకటేష్, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పేరుతో తయారు చేయించిన కేకును కట్ చేసి పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ నాయకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి నియోజకవర్గం లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజల మన్ననలు పొంది టిడిపి లో తిరుగులేని నాయకులుగా ఎదుగుతున్నారన్నారు. అందుకే రాష్ట్రస్థాయిలో పదవి వరించిందని పార్టీ కోసం పనిచేయడానికి ఆయనకు దేవుడు శక్తిని ప్రసాదించాలని మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వారు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపు కోవడానికి ఆ దేవుడు ఆయనకు ఆయుష్షు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాన్ని కల్పించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో నాయకులు కే ఎన్ రమేష్,జయరామప్ప, రాజగోపాల్,యువకులు తదితరులు పాల్గొన్నారు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

# వేరుశెనగ సాగులో జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ చర్యలు

### రైతులకు సూచనలు.. ఏడిఏ లక్ష్మనాయక్..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 5 :**
రబీ సీజన్‌లో బోరు బావుల కింద వేరుశనగ సాగు చేస్తున్న రైతులు పంటను ఆశించే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్ సూచించారు. గురువారం మండలంలోని రామాపురం గ్రామంలో వేరుశనగ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటను ఆశించే ప్రధాన తెగుళ్లలో టిక్కా ఆకుమచ్చ తెగులు ముఖ్యమని తెలిపారు. ఈ తెగులు నివారణకు సాఫ్ రెండు గ్రాములు లేదా హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పురుగు మందులు, రసాయన ఎరువులను అవసరానికి మించి వాడకూడదని, పంట పరిస్థితిని బట్టి సరైన మోతాదులో మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. పంట ఎదుగుదల దశలో రైతులు నిరంతరం పొలాలను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. అలాగే మందులు పిచికారీ




రైతులకు సూచనలు ఇస్తున్న ఏడిఏ లక్ష్మనాయక్

చేసే సమయంలో గాలి తక్కువగా ఉన్న అనుకూల వాతావరణంలో జాగ్రత్తలు పాటిస్తూ పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకుడు చిగిచెర్ల నాగార్జునతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌కు చేరిన 10వ తరగతి ప్రశ్న పత్రాలు


**అగళి (తెలుగోడు), మార్చి 5 :**
భద్రతా చర్యలో భాగంగా గురువారం 10వ తరగతి ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేర్చినట్లు ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం నెంబర్ 66001,స్థానిక కేజీబీవీ పాఠశాల పరీక్ష కేంద్రం నెంబర్ 66002 కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని అన్నారు. పరీక్షలు జరిగే తేదీల్లో ప్రతి రోజు ఉదయం 8-45 కు ప్రశ్న పత్రాలను కస్టోడియన్ రత్నగిరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర మూర్తి,ఎస్ ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో భద్రపరచిన ప్రశ్నపత్రాలను తీసి పోలీసుల వెంట పరీక్ష కేంద్రాలకు తీసుకువెళ్లాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో వుంటుందని, పరీక్ష సమయంలో ఆగళి,మధూడి గ్రామాల్లో సమీపాన ఉన్న జెరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో త్రాగునీరు ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ నెల 16 నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని అన్నారు. ప్రతిరోజు స్క్వాడ్ ప్రతి రోజు పర్యవేక్షణ ఉంటుందన్నారు.



10వ తరగతి ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్లో భద్రపరుస్తున్న విద్యాధికారులు

## తాలూకా వక్కలిగ సంఘం అధ్యక్ష పదవి రేసులో ఇరిగేపల్లి శ్రీనివాస్

**అగళి (తెలుగోడు), మార్చి 5 :**
మడకశిర తాలూకా కుంచిటిగ వక్కలిగ సంఘం అధ్యక్షుని రేసులో అగళి మండలం ఇరిగేపల్లి శ్రీనివాస్ మూర్తి ఉన్నట్లు తెలుస్తోంది. మడకశిర నియోజకవర్గంలో కుంచిటి వక్కలిగా సంఘం అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ఇటీవల అగళి మండలం లోని ఒక్కలిగలందరూ కలిసి పార్టీలకతీతంగా ఆరు మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. అందులో ఇరిగేపల్లి శ్రీనివాస్ మూర్తి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మా తండ్రి అప్పన్న ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ వక్కలిగ సంఘం అభివృద్ధికి కృషి చేశారని, అలాగే నేను కూడా ఒక్కలిగ సంక్షేమం కోసం దాదాపు 20 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. అగళి మండలం నుంచి ఎంపికైన డైరెక్టర్లు కూడా తనకు మద్దతు తెలుపడమే కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఎక్కువ శాతం డైరెక్టర్లు పార్టీలకతీతంగా తనకే మద్దతు తెలుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మడకశిర నియోజకవర్గ కుంచిటి ఒక్కలిగా సంఘం అధ్యక్షుడిగా పోటీ చేస్తానని శ్రీనివాస్ మూర్తి తెలిపారు,ఇలాఉండగా వక్కలిగ సంఘం తాలూకా అధ్యక్షుని పదవి కోసం హలుకూరు కాంతరాజు,విశ్వనాథ్, అనంతరాజు,గణేష్, నాగరాజు,తీవ్రంగా పోటీ పడుతున్నట్లు సమాచారం. శ్రీనివాస్ మూర్తి మండలంలోనే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజల మన్ననలు పొందిన సీనియర్ నాయకుడిగా ఎదుగుతున్నారు. కావున శ్రీనివాస్ మూర్తికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.





శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అగళి మండల క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, ఇతర మండలాల క్లస్టర్ ఇంచార్జిలు

## శిక్షణ తరగతుల్లో పాల్గొన్న క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్

**అగళి (తెలుగోడు), మార్చి 5 :**
మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణా తరగతులకు మడకశిర నియోజకవర్గం లోని అన్ని మండలాల క్లస్టర్ ఇన్చార్జిలు వెళ్లి పాల్గొన్నారు. గత కొన్ని రోజుల ముందు మండల కన్వీనర్ లకు,మండల ప్రధాన కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం క్లస్టర్ ఇంచార్జ్ లకు మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్రకార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా అగళి మండల క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ వెళ్లి పాల్గొన్నారు,పార్టీ బలోపేతం,ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలన్న విషయాలపై శిక్షణ ఇచ్చినట్లు శివకుమార్ తెలిపారు.

## వైఎస్సార్సీపీ వర్గీయుని పొలంలో డ్రిప్ పైపులు ధ్వంసం

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 5 :**
మండలంలోని పోట్లమర్రి గ్రామంలో వైఎస్సార్సీపీ వర్గీయుడైన రైతు పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్ సాగు పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వ్యవసాయానికి ఉపయోగించే పరికరాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ ఘటనపై గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. బాధితుడు తరిక భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోట్లమర్రి గ్రామానికి చెందిన ఎరికల భాస్కర్‌కు చెందిన పొలాన్ని తాను సాగు చేసుకునేందుకు తీసుకుని అందులో బెండ, టమోటా తదితర కూరగాయల పంటలు సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం పొలాన్ని దుక్కులు చేసి బుధవారం డ్రిప్ పైపులు, లేటరల్ పైపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో ఏర్పాటు చేసిన సుమారు 15 డ్రిప్ పైపులు, వైరులను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా పైపులు కోసి, పాడుచేసి ఉండటాన్ని గమనించినట్లు చెప్పారు. ఈ ఘటన వల్ల తనకు సుమారు రూ.15 వేల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇటీవల రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగి ఉండవచ్చని కొందరు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉపయోగించే పరికరాలను ధ్వంసం చేయడం ద్వారా రైతులను ఆర్థికంగా దెబ్బతీసే చర్యలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. రైతు పరికరాల ధ్వంసంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పొలంలో ఏర్పాటుచేసిన డ్రిప్ పైపులు ధ్వంసం చేసిన దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అజయ్ కుమార్

# టీనేజ్ గర్భధారణల నివారణకు చర్యలు

**సబ్ కలెక్టర్ టి. అజయ్ కుమార్..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**

టీనేజ్ గర్భధారణలను నివారించడం జిల్లా పరిపాలన యొక్క ముఖ్య లక్ష్యమని సబ్ కలెక్టర్ టి. అజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఆదోని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమగ్ర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్యవివాహాలను అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు కలిసి పనిచేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని గ్రామస్థులకు స్పష్టంగా తెలియజేయాలని ఆయన అన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించడం చాలా అవసరమని సబ్ కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా 8వ, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు కళాత్మక పద్ధతుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది భాగస్వామ్యం కావాలని చెప్పారు. గ్రామాల్లో పనిచేస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది కూడా కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. టీనేజ్ వయసు విద్యార్థులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడైనా బాల్యవివాహాల ప్రయత్నాలు కనిపించిన వెంటనే స్పందించి వాటిని అరికట్టాలని సూచించారు. అలాగే విద్య మధ్యలోనే చదువు మానేస్తున్న డ్రాప్అవుట్ విద్యార్థులను గుర్తించడం కూడా అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో చదువు మానేసిన విద్యార్థుల వివరాలు సేకరించి వారిని మళ్లీ విద్యలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టీనేజ్ గర్భధారణలకు పేదరికం, నిరక్షరాస్యత, గ్రామీణ ప్రాంతాల్లో సరైన సదుపాయాల లోపం, జీవన నైపుణ్యాల కొరత వంటి అనేక సామాజిక ఆర్థిక కారణాలు ప్రధానంగా ఉన్నాయని గ్రౌండ్ లెవెల్ నివేదికలు సూచిస్తున్నాయని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి సమస్యల మూలాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏఓ వసుంధర, డివిజన్ స్థాయి అధికారులు, ఐసిడిఎస్ సీడీపీవోలు సత్యవతి, దిల్లేశ్వరి, డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ, పోలీస్ శాఖకు చెందిన సీఐ పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉద్యోగినులు

# అనంతపురం, నంద్యాల జిల్లాల్లో రైతు విజ్ఞాన యాత్ర

## ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతికతలపై రైతులకు అవగాహన ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 - 26 కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం రైతు విజ్ఞాన యాత్రను నిర్వహించారు. మంత్రాలయం డివిజన్ పరిధిలో సుమారు 30 మంది రైతులు ఈ విజ్ఞాన యాత్రలో పాల్గొన్నారు. ఉద్యాన శాఖ అధికారిణి అపర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో రైతులు అనంతపురం, నంద్యాల జిల్లాలలోని పలు ఉద్యాన పంటల తోటలను సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న ఆధునిక సాగు విధానాలు, నీటి నిర్వహణ పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే సాంకేతికతలను రైతులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఓ అపర్ణ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు రైతాంగానికి ఎంతో లాభదాయకమని తెలిపారు. ప్రస్తుత కాలంలో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చని, అందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అనంతపురం, నంద్యాల జిల్లాల్లో సాగు చేస్తున్న పలు రకాల పండ్ల తోటలు, కూరగాయల సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను రైతులు ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి రైతులతో కూడా చర్చలు జరిపి పంటల నిర్వహణ, వ్యాధి నియంత్రణ, మార్కెటింగ్ అవకాశాల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ రైతు విజ్ఞాన యాత్ర ద్వారా నూతన సాంకేతిక పద్ధతులపై మంచి అవగాహన కలిగిందని పాల్గొన్న రైతులు తెలిపారు. తమ ప్రాంతాల్లో కూడా ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ఈ యాత్ర ప్రేరణనిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.




రైతు విజ్ఞాన యాత్రలో పాల్గొన్న రైతులు






ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు







రైతు విజ్ఞాన యాత్రలో భాగంగా ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న రైతులు

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

## టీడీపీ నేతలు నరవ దంపతులు..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**

పేద, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న, సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు స్పష్టం చేశారు. పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి, పెద్దకడబూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులను అందజేశారు. జాలవాడి గ్రామానికి చెందిన వడ్డె రాముడు భార్య వడ్డె సునీతకు రూ. 30,028, పెద్దకడబూరు గ్రామానికి చెందిన షాబిర్ బాషా భార్యకు రూ. 20,484 చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలాంటిదిగా మారిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా ఉపశమనం పొందుతున్నాయని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఈ నిధి త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాలవాడి మునిస్వామి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



షాబీర్ బాషాకు చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు



జాలవాడి వడ్డె రాముడుకు చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

# గ్రామ సర్వేయర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## తహసీల్దార్ గీతా ప్రియదర్శి, మండల సర్వేయర్ తేజస్వినికి వినతి ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**

గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం పెద్దకడబూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, మండల సర్వేయర్ తేజస్వినిలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్వేయర్లు ఓంకార్, తిమ్మేష్, పరుశురాం, లలిత, మౌనిక మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన భూ సర్వేలు, భూమి పరిమాణాల నిర్ధారణ, రికార్డుల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను గ్రామ సర్వేయర్లు నిర్వర్తిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనం, భద్రత, పదోన్నతి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకు లభిస్తున్న వేతనం జీవన వ్యయాలకు సరిపోవడం లేదని, కనీసం రూ.30 వేల బేసిక్ పేను ప్రభుత్వం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామ సర్వేయర్లకు పదోన్నతుల అవకాశాలు కల్పిస్తూ ఉద్యోగ భద్రతను కూడా ప్రభుత్వం కల్పించాలని కోరారు. గ్రామ సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించకపోతే తమ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడతామని తెలిపారు.



తహసీల్దార్ గీతా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు



మండల సర్వేయర్ తేజస్వినికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

# అధిక సాంద్రత ఆముదం పంటలో క్షేత్ర దినోత్సవం

**కోసిగి (తెలుగోడు), మార్చి 5 :**

కోసిగి మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి మరియు భారత నూనెగింజల పరిశోధనా సంస్థ , రాజేంద్రనగర్ సంయుక్త భాగ్యస్వామ్యంతో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక పథకం కింద కోసిగి మండలం కామండొడ్డి గ్రామంలో అధిక సాంద్రత ఆముదం (ఐ సి హెచ్-5) పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన రైతులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి పి. వరలక్ష్మి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ తినదగిన నూనెల మిషన్ పథకం ద్వారా దేశంలో నూనెగింజల పంటల ఉత్పత్తి పెంపుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా అధిక దిగుబడి రకాలు, శాస్త్రీయ సాగు పద్ధతులు మరియు పంట విస్తీర్ణం పెంపు ద్వారా రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఐ.ఐ.ఓ.ఆర్ ( ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసర్చ్ ) ప్రధాన శాస్త్రవేత్త డా. పి. లక్ష్మమ్మ మాట్లాడుతూ, హెచ్.డీ.పీ.ఎస్ విధానంలో ఆముదం సాగు చేస్తే అధిక మొక్కల సాంద్రతలో సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ విధానంలో కానోపీ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యమని, మొక్కల శాఖాభివృద్ధిని నియంత్రించి సమతుల్య పెరుగుదల కోసం పాక్లోబ్యూట్రాజోల్ వంటి గ్రోత్ రెగ్యులేటర్లను సిఫారసు చేసిన మోతాదులో వినియోగించడం వల్ల పుష్పోత్పత్తి మరియు గింజల ఏర్పాటులో మెరుగుదల సాధ్యమవుతుందని వివరించారు. అలాగే సరైన ఎరువుల నిర్వహణ, పురుగుల నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు.కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డా. కె. రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ, నూనెగింజల పంటల విస్తీర్ణం పెంపు ద్వారా దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించవచ్చని తెలిపారు. రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు అనుసరిస్తే ఆముదం పంటలో మంచి లాభాలు పొందవచ్చని సూచించారు.ఈ అధిక సాంద్రత పద్ధతిని సరైన యాజమాన్య పద్ధతులతో పాటిస్తే, ఎకరాకు దాదాపు 12 క్వింటాళ్ల దిగుబడిని సాధించడం సులభతరమవుతుందని వెల్లడించారు.

కోసిగి మండలం వ్యవసాయ అధికారి యం.వరప్రసాద్ మాట్లాడుతూ తక్కువ నీటి వినియోగం గల ఆముదం, కుసుమ, నువ్వుల పంటలను సాగు చేయడం వలన తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు . నూనె గింజల రైతులకు సబ్సిడీపై అందించే కార్యక్రమాలు కోసిగి మండలంలో నిర్వహించాలని సంస్థ వారిని కోరారు.ఈ కార్యక్రమంలో డా. కె.టి. రమ్య , కోసిగి ఏడీఏ బాలవర్ధి రాజు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఎస్సీ-ఎస్పీ పథకం కింద రైతులకు టార్పాలిన్లు మరియు స్ప్రేయర్లు పంపిణీ చేశారు.



ఆముదం పంటను పరిశీలిస్తున్న అధికారులు



రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# మాజీ సర్పంచ్ భార్య పూజారి హనుమక్క మృతి

## వైసీపీ నేతలు నివాళులు..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**

పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కీ.శే. పూజారి గిరిణి నరసన్న భార్య , గ్రామ సర్పంచ్ పూజారి ఇందిరమ్మ అత్త పూజారి హనుమక్క (80) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం రాత్రి వరకు కొడుకులు, కోడళ్లు మనవలు, మనవరాళ్లతో ఆనందంగా గడిపి నిద్రపోయిన పూజారి హనుమక్క ఆకస్మికంగా మృత్యుఒడిలోకి వెళ్లిపోయింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పూజారి హనుమక్క మృతితో తమ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని కుమారుడు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, కోడలు గ్రామ సర్పంచ్ పూజారి ఇందిరమ్మ తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుతున్నట్లు తెలిపారు.

**వైసీపీ నేతల నివాళి..**

హనుమాపురం గ్రామంలో పూజారి హనుమక్క మృతి సమాచారాన్ని తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండల సభ్యులు, కోడుమూరు అసెంబ్లీ పరిశీలకులు పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు బ్రహ్మయ్య ఆచారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పూజారి హనుమక్క ఆకస్మిక మృతి పూజారి వారి కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



పూజారి హనుమక్క (ఫైల్ ఫోటో)





పూజారి హనుమక్క మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు, కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న వైసీపీ నాయకులు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

## రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ఎల్ఎన్ పేట (తెలుగోడు), 5 :**
మండలంలోని తురకపేట జంక్షన్ కు సమీపంలో అలికాం-బత్తిలి ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై గురువారం జరిగిన ప్రమాద లో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన పాపారావు ఎల్ ఎన్ పేటలో శుభకార్యక్రమానికి హాజరై తిరిగి సోదరుడితో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్రిప్పర్‌ను ఢీకొన్నారు. ఈ సంఘటనలు వాహనం నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలకు గురికాగా, వెనుక వైపు కూర్చున్న పాపారావు తీవ్ర గాయాలకు గురియ్యారు. 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి కి తరలించారు. సరుబుజ్జిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నకొల్లివలస సర్పంచ్ చెక్ పవర్ రద్దు

**ఎల్ఎన్ పేట (తెలుగోడు), 5 :**
మండలంలోని చిన్నకొల్లివలస ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి భర్త రెడ్డి రామారావు చెక్కు పవర్ రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భారతి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ కి సంబంధించి సంబంధించిన 2021- 2022, నుండి 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో 4.75 లక్షల నిధులు దుర్వినియోగం పై అందిప ఫిర్యాదు మేరకు డిఎల్పీఓ విచారణ చేపట్టారన్నారు. వీటికి అనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో పైడి. శ్రీనివాసరావు తెలిపారు.



సర్పంచ్
రెడ్డి రామారావు

## ఈనెల 10 లోపు ఇండెంట్ పెట్టుకోవాలి

**ఎంఇఓ శ్రీధర్ ..**

**రోళ్ల (తెలుగోడు), మార్చి 5 :**
మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 10 లోపు ఏప్రిల్ నెలలకు సంబంధించిన బియ్యం, గుడ్లు, చిక్కీల కోసం అవసరమైన ఇండెంట్లు యాప్ లో తప్పనిసరిగా 10 మార్చి లోపు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా, పాఠశాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న బియ్యం, గుడ్లు, చిక్కీ నిల్వల ఖచ్చితమైన ముగింపు నిల్వ (క్లోసింగ్ బ్యాలన్స్ ) ను ధృవీకరించి, అదే వివరాలను యాప్ లో నమోదు చేయాలన్నారు. దీనివల్ల విద్యా సంవత్సరాంతానికి పాఠశాలల్లో ఎటువంటి మిగిలిన నిల్వ (లెఫ్టవర్ స్టాక్ ) ఉండకుండా చూసుకోవాలన్నారు.





తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనయుని వివాహానికి హాజరైన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



# వైభవంగా వేంకటేశ్వరస్వామి చక్ర తీర్థం

**హిరమండలం (తెలుగోడు), 5 :**
హిరమండలం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుబలయ మెట్ట పై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి చక్ర తీర్థ స్నానాలు వైభవంగా జరిగాయి. డోలోత్సవాలు భాగం గురువారం శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు బృందావన్ పండా స్వామి వారికి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరుడవాహనంపై వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు పోలీస్ బందోబస్తు మధ్య,మంగళ వాయిద్యాలు, గొట్టా బ్యారేజి ప్రాజెక్టు దిగువ భాగాన వంశధార నదీ కి తీసుకు వెళ్లి స్వామివారిని చక్ర తీర్థం ఆచరించారు భక్తులు గోవిందా...గోవిందా నామస్మరణ తో నదీ స్నానాలు చేశారు. జిల్లాతోపాటు ఒడిశా నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తూరు సిఐ చింతాడ. ప్రసాద్, కొత్తూరు , హిరమండలం ఎస్ ఐ లు వెంకటేష్, హేమంత్ కళ్యాణ్ పర్యవేక్షించారు. మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహించారు. నిర్వహకులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



వేంకటేశ్వరస్వామి చక్ర తీర్థం నిర్వహిస్తున్న దృశ్యం

### ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో

# ఎంబీఏ యువకుడి బలవన్మరణం

**నాలుగేళ్లుగా ఉద్యోగం కోసం ప్రయత్నాలు..**
**నిరాశతో బలవన్మరణం..**
**బత్తలపల్లి మండలంలో విషాదం..**

**బత్తలపల్లి (తెలుగోడు), 5 :**
ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఎంబీఏ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన బత్తలపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఈదులముష్టూరు బీసీ కాలనీలో నివాసముంటున్న తలారి గోపాల్, రాములమ్మ దంపతుల చిన్న కుమారుడు సింహాద్రి (25) ఎంబీఏ పూర్తి చేసినప్పటికీ నాలుగేళ్లుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ తీవ్ర నిరాశకు లోనయ్యాడు. స్నేహితులకు ఉద్యోగాలు రావడం, తనకు అవకాశాలు రాకపోవడం వల్ల మానసికంగా బాధపడుతున్నాడు. కుటుంబ పోషణ కోసం పశువుల పెంపకం చేపట్టినా నిరుద్యోగ బాధ అతడిని వెంటాడుతూనే ఉండేది. ఈ నేపథ్యంలో సోమవారం తన అన్న పవన్‌కు ఫోన్ చేసి తనకు ఉద్యోగం వచ్చేలా లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తర్వాత అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పశువుల పాక వద్దకు వెళ్లి చూడగా సింహాద్రి ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు సహకారంతో వెంటనే ఊరి తప్పించి ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన సింహాద్రి

***జాబ్ క్యాలెండర్ విడుదలలో ప్రభుత్వం విఫలం..***
***వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి నాయకుడు బోయ సాంబశివ..***

ఈ ఘటనపై స్పందించిన మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి నాయకుడు బోయ సాంబశివ, మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. నిరుద్యోగ యువతను ఆదుకునే చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

# గాయపడిన కార్యకర్త హనుమంతుకు పరామర్శ

**టీడీపీ నేత గవిగట్టు మల్లికార్జున..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**
పెద్దకడుబూరు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామానికి చెందిన గోపాలి హనుమంతు ఇటీవల గోడ కూలిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆదోని పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పెద్దకడుబూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గవిగట్టు మల్లికార్జున ఆసుపత్రికి వెళ్లి హనుమంతును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని ధైర్యంగా ఉండాలని హనుమంతుకు భరోసా ఇచ్చారు. అలాగే హనుమంతుకు అవసరమైన మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రమాదంలో గాయపడిన హనుమంతు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని మల్లికార్జున ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా హనుమంతు ఆరోగ్యం గురించి తెలుసుకుని ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హనుమంతును పరామర్శిస్తున్న టీడీపీ నేత మల్లికార్జున



వైద్యులతో మాట్లాడుతున్న టీడీపీ నేత గవిగట్టు మల్లికార్జున

# సీఎం చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

**రోళ్ల (తెలుగోడు), మార్చి 5 :**
అసెంబ్లీ సమావేశం తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు సమావేశమైయారు. ఈసందర్భంగా ఇద్దరి భుజాలపై చంద్రబాబు చేతులు వేసి ఆప్యాయతంగా పలకరించారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధి పై చర్చించారు. ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు రాష్ట్ర నాయకులతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో కలియ తిరిగారు.




మడకశిర నియోజక వర్గం అభివృద్ధి పై చంద్రబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి


# గరుడ వాహనంపై ఊరేగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి

**రోళ్ల (తెలుగోడు), మార్చి 5 :**
స్థానికంగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారు గరుడవాహనంపై ఊరేగారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆయాస్వాములకు గంగాజలంతో అభిషేకార్చనలు సుప్రభాత సేవలు వివిధ పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి పల్లకిని పూలమాలలతో ముంచెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు ఉత్సవాన్ని తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



**నేడు పూల పల్లకి ఉత్సవం...**

పది రోజులపాటు జరిగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారు పూల పల్లకిపై ఊరేగనున్నారు. పూల పల్లకి ఉత్సవాలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



పత్తికొండ, కోడుమూరు అసెంబ్లీ పరిశీలకులుగా నియమితులైన వై. సీతారామిరెడ్డి, ఆర్. పురుషోత్తం రెడ్డి

## అసెంబ్లీ పరిశీలకులుగా మంత్రాలయం నుంచి ఇద్దరికి అవకాశం

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 5 :**
వైసీపీ తరుపున అసెంబ్లీ పరిశీలకులుగా మంత్రాలయం నియోజకవర్గం నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. పత్తికొండ అసెంబ్లీ పరిశీలకులుగా మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన వై. సీతారామిరెడ్డి నియమితులయ్యారు. కోడుమూరు అసెంబ్లీ వైసీపీ పరిశీలకులుగా పెద్దకడబూరు మండలం కంబదహాల్ కు చెందిన ఆర్. పురుషోత్తం రెడ్డి నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం విడుదల చేసింది. తమ అసెంబ్లీ పరిశీలకులుగా నియమించినందుకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ బలోపేతానికి సైనికుల్లా పని చేస్తామని వెల్లడించారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ వెంకట మోహన్

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఎస్సై వెంకట మోహన్ ..**

**రామకుప్పం (తెలుగోడు), 5 :**
విద్యార్థులు చదువులు అభ్యసించే సమయంలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై వెంకట మోహన్ విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. రానున్న పదవ పరీక్షలకు మాస్ కాపీయింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు దృష్టిలో ఉంచుకొని పరీక్షలు రాసేందుకు సిద్ధం కావాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి

**రామకుప్పం (తెలుగోడు), 5 :**
గ్రామాల్లోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్ష ,మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి పేర్కొన్నారు. గురువారం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద టీడీపీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. విధి దీపాలు, డ్రైనేజీలు, సిసి రోడ్డు, బిటి రోడ్డు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికలకు కూటమి ప్రభుత్వ అభ్యర్థుల గెలుపుకు ఇప్పటినుంచే సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేత నారాయణ చారి, పార్టీ కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, గంట్లప్ప గౌడు,జయశంకర్, శంకరాచలం, పెరుమాళ్, మంజునాథరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ,రఘు, విజయ్ రెడ్డి, బాలరాజు, ఆదిల్, మంజునాథ్, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రీడింగ్ చైర్లు వితరణ

**రామకుప్పం (తెలుగోడు), 5 :**
మండలంలోని ఆనిగానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు రీడింగ్ చైర్లు, ప్యాడ్లును వితరణ చేశారు. పదవ తరగతి పరీక్షలతో పంచాయతీ ఏఈ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ డైరెక్టర్ రామ్మూర్తి, సులోచన గుర్రప్ప, సత్యనారాయణ శెట్టి 25 వేల రూపాయలు విలువచేసే వస్తువులను విద్యార్థులకు అందజేశారు. పది పరీక్షలకు విద్యార్థులు చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇలాంటి వితరణలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్



విద్యార్థిని,విద్యార్థులకు రీడింగ్ చైర్లు వితరణ చేసిన దాతలు



# రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే సీఎం చంద్రబాబు లక్ష్యం

ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ (తెలుగోడు), మార్చి 5 :**
రాష్ట్రంను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని జయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పేద ప్రజలు ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా వారిని ఆదుకుంటున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఎపిని అభివృద్ధి పథం వైపు నడిపించటంతోపాటు, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఎంపీ శివనాథ్ వివరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో గురువారం సీఎంఆర్ ఎఫ్ కింద మంజూరైన రూ.12,24,110 విలువైన ఎల్.వో.సి పత్రాలను ఎంపి కేశినేని శివనాథ్ ఐదుగురు లబ్ధిదారులకు రాష్ట్ర సాంఘీక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య, తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు సుకాసి శ్రీనివాస్‌లతో కలసి అందజేశారు. తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన బండి శ్రీలక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6 లక్షల రూపాయల ఎల్.వో.సి పత్రాన్ని ఆమె కుటుంబసభ్యులకు ఎంపి కేశినేని శివనాథ్ అందజేశారు. అదే విధంగా రోడ్డు ప్రమాదంకు గురై తీవ్ర గాయాల పాలైన తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడుకు చెందిన భూక్యా లోకేష్‌కు రూ.1,77,044, అదే గ్రామానికి చెందిన భూక్యా ఉపేంద్ర కు రూ.2,13,916 చొప్పున వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్.వో.సి పత్రాలను ఎంపీ శివనాథ్ అందజేశారు. అదే రీతిలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మల్లిఖార్జునపేటకు చెందిన కలవకొల్లు దుర్గాభవానీ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ1,60,225 విలువైన ఎల్.వో.సి పత్రాన్ని ఎంపీ శివనాథ్ ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. విజయవాడకు చెందిన మేకా శేషగిరిరావు హెర్నియా సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.72,925 విలువైన ఎల్ఓసి పత్రాన్ని శేషగిరిరావుకు ఎంపీ అందజేశారు. తమకి సీఎంఆర్ఎఫ్ కింద ఎల్.వో.సిలు మంజూరు అయ్యే విధంగా సాయం చేసిన ఎంపి కేశినేని శివనాథ్ కి లబ్ధిదారులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు మండలం టిడిపి అధ్యక్షులు పీక్లా నాయక్, విజయవాడ మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ మైలపల్లి రాజు, ఐటిడిపి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు చైతన్యలతో పాటు తిరువూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# కొలికిపూడిపై అధిష్టానం చర్య తీసుకోవాలి

**విజయవాడ (తెలుగోడు), మార్చి 5 :**
తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు వ్యవహారశైలిపై ఎన్టీఆర్ జిల్లా టిడిపి దళిత ఎస్సీ సెల్ నాయకులు ఫైర్ అయ్యారు. పశ్చిమ నియోజకవర్గంలోని గణపతిరావు రోడ్డులో గల ఎంపీ కేశినేని శివనాథ్( చిన్ని) క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి ఎస్సీ సెల్ దళిత నాయకులైన సీనియర్ నాయకులు కామా దేవరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొట్టేటి హనుమంతరావు , జిల్లా నాయకులు బర్రె శంకరరావు, ఏపీ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్ రెంటపల్లి శ్యామ్ తదితరులు మాట్లాడారు.
ముందుగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహార తీరును తీవ్రంగా ఖండించిన టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ దళిత నాయకులు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావుపై వెంటనే టీడిపి అధిష్టానం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత ఎస్సీ వర్గాల పరువు తీసేలా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహరిస్తున్నాడంటూ మండిపడ్డారు. క్రమశిక్షణ గల టిడిపి పార్టీని తిరువూరు నియోజకవర్గంలో భ్రష్టు పట్టిస్తున్నాడని, సంస్కారం లేని నాయకుడిగా ఉన్న ఎమ్మెల్యే కొలికిపూడి పై టిడిపి అధిష్టానం వెంటనే చర్య తీసుకోవాలన్నారు. నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రోటోకాల్ పేరుతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహరించిన తీరు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) ను ఎమ్మెల్యే కొలికిపూడి కనీసం మర్యాద లేకుండా అవమానించారన్నారు. ఎంపీ చేతిలోని పట్టు వస్త్రాలు లాక్కుని రౌడీలాగా ఎమ్మెల్యే వ్యవహరించాడని, టిడిపి క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకొని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆలయంలో ఉన్న స్వామివారి కళ్యాణోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా చాలా మర్యాదగా వ్యవహరించారని తెలిపారు. ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు దళిత వాదాన్ని తెరపైకి తెస్తున్నారనీ, కొలికిపూడి శ్రీనివాసరావు ఎస్సీ అని చెప్పుకోవడానికి దళిత ఎస్సీలమైన మేమంతా కూడా సిగ్గుపడుతున్నామని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఒక వర్గానికి చెందిన పార్టీ కాదన్నారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల అభ్యున్నతి కాంక్షించే పార్టీ అంటూ ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్ద పేట వేసింది టిడిపినే అని గుర్తు చేశారు. ఎక్కడో పుట్టి పెరిగిన కొలికిపూడి శ్రీనివాసరావుకు సైతం తిరువూరులో టికెట్టు ఇచ్చి ఎమ్మెల్యేని చేసింది టిడిపి పార్టీనే అన్నారు. ఇప్పుడు ఆ పార్టీ సిద్ధాంతాలని పాటించకుండా కొలికిపూడి శ్రీనివాసరావు వీధి రౌడీలా వ్యవహరిస్తున్నాడన్నారు. నెమలి దేవస్థానంలో జరిగిన ఘటనలో ఏం జరిగిందో రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. వీధి రౌడీ లాగా ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహరించిన తీరు ను ప్రతి ఒక్కరూ అసహ్యించుకుంటున్నారని చెప్పారు. టిడిపి రాష్ట్ర అధిష్టానం సైతం ఎమ్మెల్యే కొలికెపూడి శ్రీనివాస రావు తీరును తప్పు పట్టిందన్నారు. కానీ అవినీతి, అక్రమాల పార్టీ అయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలికిపూడి శ్రీనివాసరావుకు మద్దతుగా మాట్లాడుతున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఏమి తెలుసనని ఎంపీ కేశినేని చిన్ని గురించి మాట్లాడుతున్నాడో చెప్పాలన్నారు. మట్టి, పేకాట అంటే ఎమ్మెల్యే కొలికిపూడి చేసే దందాలు అని, అందుకే కొలికపూడి కి మట్టి, పేకాట గుర్తుకు వచ్చాయంటూ ఎద్దేవా చేశారు. మాఫియా డాన్ గా కొలికిపూడి శ్రీనివాసరావు తాను చేసే పేకాట, మట్టి వ్యాపారాలను అందరూ చేస్తారని అనుకుంటున్నాడన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంటు సభ్యులుగా ఉన్న ఎంపీ కేశినేని చిన్ని పై కడుపులో దురుద్దేశంతో వ్యవహరిస్తున్నాడన్నారు. తన అక్రమ వ్యాపారాలకు, అక్రమ సంపాదనకు అడ్డుగా ఉన్నాడని ఎంపీ కేశినేని చిన్ని పై ఎమ్మెల్యే కొలికపూడి కక్ష పెంచుకున్నాడన్నారు. రాజకీయాల్లోకి రాకముందే సేవా తత్పరత కలిగిన వ్యక్తి కేశినేని శివనాద్ చిన్ని అని, అటువంటి వ్యక్తి రాజకీయాల్లోకి రావడం, విజయవాడ ఎంపీగా భారీ మెజారిటీతో గెలవడం ఎంతో శుభ పరిణామం అన్నారు. కానీ ఓర్వలేని కొలికపూడి శ్రీనివాస్ వంటి వాళ్ళు ఎంపీపై బురద జల్లాలని చూస్తున్నారన్నారు. ఎంపీ కేశినేని చిన్నిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాడన్నారు. మాఫియా డాన్ కొలికపూడి కి అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన వైసీపీ నాయకులు సపోర్ట్ చేస్తున్నారన్నారు. రాజకీయం తెలిసి తెలియని దేవినేని అవినాష్ వంటి వాళు ఎమ్మెల్యే కు వత్తాసు పలుకుతున్నారన్నారు. దేవినేని నెహ్రూ కుటుంబానికి రాజకీయ బిక్ష పెట్టిందే టిడిపి పార్టీ అని అవినాష్ గుర్తుంచుకోవాలని తెలిపారు.

# హంస వాహనంపై దర్శనమిచ్చిన చెన్నకేశవ స్వామి

**యాడికి (తెలుగోడు), మార్చి 5 :**
యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం చెన్నకేశవ స్వామి ఆలయం నందు అర్చకులు భక్తులు ఆధ్వర్యంలో ఉదయం నిత్య పూజలు. ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాభాతిక మంగళ వాయిద్య గీతా మంగళహారతులు. గంగాహరణం (బిందెసేవ) ఆగమని హెత కార్యక్రమం గ్రామం నందు బలిహరణాలు భగవంతుని తిరుమజ్జ నాధులు ఆరాధన. సహస్రనామ పూజ. ఉత్సవ మూర్తులను పల్లకి యందు ఉంచి గ్రామమున




శివలక్ష్మి చెన్నకేశవ స్వామి మూల విరాట్



శ్రీదేవి భూదేవి సమేత శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

ఊరేగింపు. విశ్వరూప సందర్శన. మంగళహారతి. మంత్రపుష్పాల సమర్పణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక హజలు అభిషేక అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని హంస వాహనంలో ఉంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం స్వామివారి ఆలయం వద్ద నుండి చిన్న రథంపై కెనరా బ్యాంక్, పాత పోలీస్ స్టేషన్ సర్కిల్. లాలాల వీధి. వైశ్య విధి. కోటవీధి. పెద్దమ్మతల్లి ఆలయం మీదుగా స్వామి వారి ఆలయానికి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



హంసవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న చెన్నకేశవ స్వామి

# రసవత్తరంగా రాతి దూలం లాగుడు పోటీలు

## మొదటి బహుమతి సాధించిన కడప జిల్లా కల్లూరు శివ కృష్ణ యాదవ్ వృషభాలు.. సీఐ శ్రీనివాసులు..

**యాడికి (తెలుగోడు), మార్చి 5 :**
యాడికి మండల కేంద్రంలో వెలిసిన శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో రాతిదూలం లాగడు పోటీలు నిర్వహించారు ఈ పోటీలో వృషభాలు 14 కాండ్లు పాల్గొన్నాయి. పెరుమాళ్ శివకృష్ణయదవ్ కల్లురు కడప జిల్లా నల్లచిరుతలు చెందిన వృషభాలు.1831.09 వృషభాలు అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వీరికి లక్ష రూపాయల బహుమతిని కోన ఉప్పలపాడు గ్రామానికి చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి అందించారు. రెండవ బహుమతి బొరెడ్డి కేశవరెడ్డి పెద్దకోటాల నంద్యాల జిల్లా సాంబశివరెడ్డిడజీ.=.వీరనసింహ రెడ్డి వృషభాలు 1814.02 అడుగులు లాగి రెండవ బహుమతి సాధించాయి వారికి 80 వేల రూపాయలను దాత వర రామకృష్ణ. భాస్కర్ పెట్రోల్ బంక్ యజమానులు అందించారు. మూడవ బహుమతి కడప జిల్లా మార్థల చంద్ర ఓబుల్ రెడ్డి చౌటపల్లె గ్రామానికి చెందిన కారంజయడమచ్చలపులి గారి వృషభాలు



రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభిస్తున్న యాడికి సీఐ శ్రీనివాసులు

1718.10 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. వీరికి 60 వేల రూపాయలు దాత జూటూరు అబ్దుల్ రజాక్ అందించారు. నాలుగవ బహుమతి నంద్యాల జిల్లా.=.పల్లె గ్రామానికి చెందిన నాగ్గయ్య చెందిన 1702.06 అడుగులు లాగి 4వ స్థానంలో నిచిచాయి. వీరికి 40 వేల రూపాయలు దాత యాడికి గ్రామానికి చెందిన పాల వ్యాపారస్తుడు. ఉమ్మడి పాల ప్రభాకర్ అందించారు. అయిదవ బహుమతిగా అనంతపురం జిల్లా మెడిమాకలపల్లె గ్రామానికి చెందిన తిరుపాల్ రెడ్డి. ఆదికేశవరెడ్డి ఉ చెన్నకేశవ రెడ్డి చెందిన వృషభాలు 1507.06 లాగి 20వేల రూపాయలు దాత అబ్దుల్ రహిమాన్ అందించారు. ఆరవ బహుమతిగా గెలుపొందిన అనంతపురం జిల్లా సోమ్మలదొడ్డి గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి 1200 అడుగులు వారికి 6వ బహుమతిగా పదివేల రూపాయలు దాత రూపులేని మనోహర్ చౌదరి (చిట్టిబాబు ) బహుమతులు అందజేశారు. ఈ రాతిదూలం లాగుడు పోటీలలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి. ఆలయ కమిటీ సభ్యులు రైతులు పాల్గొన్నారు. సిఐ శ్రీనివాసుడు గట్టి భద్రత ఏర్పాటు చేశారు.




విజేతలకు బహుమతి అందిస్తున్న సిఐ శ్రీనివాసులు



# సీనియర్ పాత్రికేయుడు దువా మరణం తీరని లోటు

మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ (తెలుగోడు), మార్చి 5 :**
సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ దౌత్యవేత్త, పార్లమెంటేరియన్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత హరి కృషన్ దువా మృతి పట్ల రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఉత్తమ జర్నలిస్టుగా సాగిన ఆయన ప్రస్థానం, హిందుస్తాన్ టైమ్స్, ఇండియన్ ఎక్స్ప్రెస్, ట్రిబ్యూన్ వంటి ప్రతిష్ఠాత్మక పత్రికలకు ఎడిటర్ గా పాత్రికేయ రంగానికి ఆయన చేసిన అమూల్యమైన సేవకు నిదర్శనం అన్నారు. ప్రధానమంత్రి మీడియా సలహాదారుగా, రాయబారిగా, రాజ్యసభ సభ్యునిగా ఆయన నిర్వహించిన వివిధ ఉన్నతమైన బాధ్యతలు, దేశానికి ఆయన అందించిన సేవలను చాటి చెబుతాయన్నారు. ఆయన రచనలు, విశ్లేషణలు భారతీయ రాజకీయాలు మరియు అంతర్జాతీయ వ్యవహారాలపై లోతైన అవగాహనకు నిదర్శనం అన్నారు. ఆయన మృతి పాత్రికేయ రంగానికి, దేశానికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నామన్నారు. .



# దుర్గా భవానీ మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని)..

**విజయవాడ (తెలుగోడు), మార్చి 5 :**
కనకదుర్గా భవానీ మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ( చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని శ్రీ రామ మందిర్ సభా ఆలయ ప్రాంగణంలో శ్రీ కనకదుర్గా భవానీ మాతాజీ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని) ముందుగా కనకదుర్గా భవానీ మాతాజీ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కు రామ్ మందిర్ సభ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఎంపీకి స్వాగతం పలికిన వారిలో శ్రీ రామ్ మందిర్ సభా కమిటీ సభ్యులు గోపాల్ శర్మ, సునీల్ చడ్డా, ఎస్ ఎన్ కుమార్ , సుభాష్ చంద్ర గుప్తా తదితరులు ఉన్నారు.



# రాజకీయ అవగాహన లేని వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

## టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్..

**విజయవాడ (తెలుగోడు), మార్చి 5 :**
ఏ మాత్రం రాజకీయ అవగాహన లేని వ్యక్తి వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అని టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ అన్నారు. అటువంటి వ్యక్తి ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడుగా ఉన్నాడంటే వైసిపి ధీన పరిస్థితి ఏంటో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్ విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొట్లూరి దర్శిత్ మాట్లాడుతూ...వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నాడన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల మీద ,విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని) పై వ్యాఖ్యలు చేయడంను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.
తిరువూరు నియోజకవర్గం నెమలిలో జరిగినటువంటి సంఘటనపై ఎంపీ ను విమర్శిస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడనీ, తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు వ్యవహార శైలిని ఆసరాగా తీసుకుని ఆ ఘటనను రచ్చ చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసిపి చూస్తోందన్నారు. దేవినేని అవినాష్ తండ్రి కూడా గతంలో కంకిపాడు శాసన సభ్యుడుగా పని చేసినప్పుడు ఆనాడు ఎంపీలుగా పనిచేసిన పర్వతనేని ఉపేంద్ర, లగడపాటి రాజగోపాల్ తో ఏ మాత్రం సఖ్యతగా ఉండేవాడో బెజవాడ ప్రజలందరికీ తెలుసు అన్నారు. పాత కాంగ్రెస్ నాయకులను ఎవరినడిగినా ఆ విషయాలు చెబుతారన్నారు. అవినాష్ తండ్రి కూడా ఎమ్మెల్యేగా ఉన్నపుడు నాటి ఎంపీలతో సఖ్యతగా ఉన్న పరిస్థితి లేదన్నారు. ఏ రాజకీయ పార్టీలో అయినా అంతర్గత విషయాలు ఉంటాయని, ఇవేమీ తెలియని దేవినేని అవినాష్‌కు రాజకీయాల పట్ల అవగాహన లేదని మరోసారి స్పష్టం అవుతోందన్నారు. అవినాష్ వంటి రాజకీయ పరిపక్వత లేని వారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుడిగా చేశారంటే ఆ పార్టీ ఎలాంటి దీన స్థితిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చన్నారు. సహజంగా రాజకీయ పార్టీలు ప్రధాన పార్టీలన్నీ కూడా సీనియర్ ప్రజా ప్రతినిధులని జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించడం జరుగుతుందనీ, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న దేవినేని అవినాష్



కార్పొరేటర్‌గా గెలిచిన పరిస్థితి లేదన్నారు. కార్పొరేటర్ స్థాయిలో కూడా గెలిచిన దాఖలాలు లేవన్నారు.
అటువంటి వ్యక్తిని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పెట్టారంటే వైసిపి పార్టీ ఎలాంటి అధ్వాన స్థితిలో ఉందో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో ఇతను ఎంపీ గా పోటీ చేస్తే కనీసం డిపాజిట్ కూడా రానిటువంటి పరిస్థితి చూశామన్నారు. ఆ తర్వాత 2019 లో ఇతను గుడివాడ వెళ్లి ప్రగల్భాలు పలికినటువంటి పరిస్థితి కూడా చూశామంటూ...గుడివాడ వెళ్లి కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉంటాం నా సెల్ ఫోన్ నెంబర్ రాసుకోండి అని చెప్పి మాట్లాడినటువంటి అవినాష్ అక్కడ ఘోర పరాభవం తర్వాత మరి 24 గంటల్లోనే తోక ముడుచుకుని బెజవాడ పారిపోయి వచ్చిన మాట వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. ఓడిపోయిన తర్వాత గుడివాడలో కనీసం తనను ఓడించిన అభ్యర్థి మీద ఒక స్టేట్మెంట్ కూడా ఇవ్వలేనటువంటి దీన పరిస్థితిలో ఉండిపోయిన అవినాష్‌కు ఎంత ధైర్యం ఉందో ఆనాడే బయటపడిందనీ, ప్రతిపక్ష పార్టీలో ఆనాడు పోరాడలేక అధికార పార్టీ చంకనాకి ఆరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడన్నారు.
అవినాష్‌ను చిత్తు చిత్తుగా ఓడించిన వైసిపి లో చేరిన తర్వాత విజయవాడ తూర్పులో నీ అరాచకాల్ని దందాల్ని మొదలుపెట్టిన ప్రజలను పీడించాడన్నారు. ఏ వీధిలో ఇసుక గుట్ట కంకర గుట్ట కనపడినా అవినాష్ మనుషులంతా రాబందుల్లా వాలిపోయి కాసుల కోసం ప్రజలను దోచుకుతిన్నారన్నారు. ప్రతి భవన యజమాని దగ్గర లక్షలాది రూపాయలు నువ్వు వసూలు చేయించి వైసిపి అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల్లో కోట్లది రూపాయలు ప్రజల దగ్గర దందాలు చేసి, ఇవ్వని వారి భవనాల స్లాబులు పగలుగొట్టించి అరాచకం చేసిన చరిత్ర అవినాష్ సొంతం అన్నారు. అటువంటి అక్రమార్కుడు దేవినేని అవినాష్ నేడు విజయవాడ పార్లమెంట్ సభ్యుడిని దందాలు చేశారని మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందన్నారు. మూడు సార్లు ఎన్నికల్లో పోటీచేసిన దేవినేని అవినాష్‌కు మూడు ఎన్నికల్లో కలిపి లక్షా 80 వేల ఓట్లు కూడా రాలేదని, మొదటి సారే ఎంపీగా ప్రజల మద్దతుతో 2.85లక్షల మెజార్టీతో గెలిచిన నిజమైన ప్రజా నాయకుడు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మూడు ఎన్నికలలో పోటీ చేసి మూడు సార్లు ఓడి పోయిన ఘనుడు అవినాష్ అన్నారు. అటువంటి అవినాష్‌కు విశేష ప్రజాదరణ ఉన్న కేశినేని చిన్నిని విమర్శించే నైతికత ఉందా ? అని అన్నారు.
ప్రస్తుతం ఏదో జిల్లా అధ్యక్షుడు కదా అని చెప్పి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఇక్కడ చూస్తూ ఊరుకోవడానికి ఎవరూ కూడా సిద్ధంగా లేరన్నారు. తిరువూరులో జరిగినటువంటి వ్యవహారంలో నెమలి గుడికి సంబంధించినటువంటి చైర్మన్ మీ వైసిపి మండల పార్టీ అధ్యక్షుడి భార్య ఆవిడతో ప్రెస్ మీట్ పెట్టించి ఎంపి కేశినేని చిన్ని తప్పు ఉందని నువ్వు చెప్పించగలవా ? అన్నారు. ఆ ధైర్యం నీకు ఉందా? అవినాష్ అని సవాల్ విసిరారు. ఎంపీ తప్పు లేదని అక్కడ ప్రజలందరికీ తెలుసు అన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావుకు వైసిపి ప్రభుత్వ పాలనలో ఏనాడైనా నువ్వు ప్రోటోకాల్ ఇచ్చావా? ఇవ్వనిచ్చావా? అని ప్రశ్నించారు. అటువంటి అవినాష్ ఇప్పుడు ప్రోటో కాల్ అంటూ మాట్లాడటం పిగ్గుచేటన్నారు. ఒక్కసారి కూడా ఎన్నికల్లో గెలవని నీకు ప్రోటోకాల్ అంటే ఏంటో అసలు తెలుసా అంటూ ఎద్దేవా చేశారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గానీ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గాని, యువ నేత నారా లోకేష్ గాని వారి హుందాతనాన్ని ఒక ఐదు నిమిషాలు తీసి పక్కన పెడితే నువ్వు ప్రెస్ లో మాట్లాడడానికి కాదు కదా విజయవాడలో తిరగడానికి గాని అవినాష్ సాహసం చేయడన్నారు. ఇప్పటికైనా హద్దులు దాటి మాట్లాడవద్దని, నోరు అదుపులో ఉంచుకోవాలని అవినాష్‌కు హితవు పలుకుతున్నామని, లేని పక్షంలో గుణపాఠం తప్పదన్నారు. దేవినేని అవినాష్‌కి ఫ్యూజులు కొట్టేసి, కన్ఫ్యూజన్ లో ఉన్నాడని అన్నారు.


# 19ననే వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్

ఉస్తాద్ భగత్ సింగ్'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్ . ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఉగాదికి దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా వెల్లడించారు. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్లు తెలిపారు. 'ఈ ఉగాదికి ఉస్తాద్ ఊచకోత' అంటూ కొత్త పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేయాలని భావించారు. అన్ని పనులు పూర్తి కావడంతో వారం ముందుగానే మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సిద్ధమయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. పోలీస్ ఆఫీసర్‌గా పవన్ స్టైలిష్‌గా కనిపించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పాటలు, వీడియోలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి.




# ఫాంటసీ టచ్‌తో వృషకర్మ..గ్లింప్స్ విడుదల

'తండేల్' విజయం తర్వాత కథానాయకుడు నాగచైతన్య నుంచి రానున్న సినిమా 'వృషకర్మ'. కార్తీక్ దండు దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. తాజాగా దీని గ్లింప్స్‌ను విడుదల చేశారు. చైతూ ఈ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా కనిపించారు. ఆయనకు జోడీగా మీనాక్షి చౌదరి నటించారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై నిర్మాతలు బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ మరియు సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు కార్తీక్ వర్మ దండు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే 'వృషకర్మ'పై సినీప్రియుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన గ్లింప్స్ ఆ ఆసక్తిని మరింత పెంచింది. ఈ గ్లింప్స్ చూస్తే సినిమా హారర్ థ్రిల్లర్‌తో పాటు సోషియో ఫాంటసీ అంశాల మేళవింపుగా రూపొందుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. విడుదలైన గ్లింప్స్‌లో మొదటి నుంచే ఒక మిస్టీరియస్ వాతావరణాన్ని క్రియేట్ చేశారు. చీకటి సన్నివేశాలు, భయానకమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అర్థం కాని సంఘటనలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. ముఖ్యంగా నాగ చైతన్య పాత్ర చాలా సీరియస్, ఇంటెన్స్‌గా కనిపించడం ఆసక్తికరంగా మారింది. భయానక ఘటనల మధ్య జరిగే కథలో ఆయన పాత్ర కీలకంగా ఉండబోతుందని గ్లింప్స్ సూచిస్తోంది. సినిమా కథలో గ్రామీణ నేపథ్యంలో జరిగే కొన్ని రహస్య సంఘటనలు, వాటి వెనుక ఉన్న శక్తులు, వాటిని ఎదుర్కొనే హీరో ప్రయాణం ప్రధానంగా ఉండొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. హారర్ అంశాలకు తోడు సామాజిక సందేశం కూడా ఉండేలా దర్శకుడు కథను తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. హీరోయిన్ మీనాక్షి చౌదరి పాత్ర కూడా కథలో ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం. విజువల్స్, టెక్నికల్ వాల్యూస్, మ్యూజిక్ అన్నీ కలిసి ఈ సినిమాను ఒక కొత్త అనుభూతిగా మార్చేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్లింప్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. చాలా మంది అభిమానులు ఈసారి నాగ చైతన్య ఖచ్చితంగా ఒక బిగ్ హిట్ అందుకుంటాడు అని కామెంట్లు చేస్తున్నారు. ఇటీవల విభిన్న కథలతో ముందుకు వస్తున్న నాగ చైతన్య, 'వృషకర్మ'తో మరో కొత్త ప్రయోగం చేయబోతున్నాడని చెప్పొచ్చు. మొత్తానికి, భయానక వాతావరణం, థ్రిల్లింగ్ అంశాలు, ఫాంటసీ టచ్‌తో 'వృషకర్మ' ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్లింప్స్‌తోనే ఈ సినిమా మీద అంచనాలు భారీగా పెరిగాయి. ఇక పూర్తి కథ ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.




# తమిళ అమ్మాయి కొరియా టూర్.. మేడ్ ఇన్ కొరియా ట్రైలర్ విడుదల



మీకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులే మీ మనసుని ఎక్కువగా పరీక్షిస్తారంటూ తన కలల ప్రపంచంలోని పరిస్థితుల గురించి పంచుకుంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. చిన్న గ్రామంలో కలలు కంటూ.. ట్రైన్ ఎక్కైనా కొరియా వెళ్తానంటూ మొదలైన తన ప్రయాణం ఎలా సాగిందో తెలియాలంటే 'మేడ్ ఇన్ కొరియా' చూడాల్సిందే. క్రాస్ కల్చర్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రాన్ని రా.కార్తిక్ తెరకెక్కించారు.

ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్స్‌లో భాగంగా రూపొందిన ఈ సినిమా ఈ నెల 12 నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది నెట్‌ఫ్లిక్స్. 'కొన్నిసార్లు మీరు ఊహించని వ్యక్తుల నుంచి ప్రేమని పొందుతారు.. కొరియా పట్ల నాకున్న ప్రేమ నన్ను నేను తెలుసుకునేలా చేసింది' లాంటి ఆసక్తికరమైన డైలాగులు.. కొరియాలో ఎదురైన చేదు అనుభవాల ప్రియాంక సన్నివేశాలతో ఆకట్టుకునేలా ఉందీ ట్రైలర్. ఈ సినిమాలో దక్షిణ కొరియా నటుడు పార్క్ హై జిన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఓ తమిళ అమ్మాయి కొరియా వెళ్లిన నేపథ్యంతో రూపొందిందీ చిత్రం.

# వృషకర్మ ఈవెంట్‌లో కిందపడ్డ నాగచైతన్య



'వృషకర్మ' ఈవెంట్‌లో హీరో నాగచైతన్య పడిపోయారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ఐమ్యాక్స్ పీసీఎక్స్ స్క్రీన్‌లో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలో చిత్ర బృందం స్పీచ్ పూర్తయ్యాక మీడియాతో చిట్‌చాట్ కోసం కుర్చీలను వేదికపై తీసుకొచ్చారు. ఓ కుర్చీలో నాగచైతన్య కూర్చోగానే అది ఒక్కసారిగా వంగిపోయింది. దీంతో, చైతన్య వెనక్కిపడిపోయారు. చిత్ర బృందం, అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. చైతన్యకు ఏమైనా దెబ్బ తగిలిందేమోనంటూ కంగారుపడ్డారు. అప్పటికే తేరుకున్న చైతన్య.. పక్కనే ఉన్న దర్శకుడు కార్తీక్ దండు సహాయంతో లేచి మరో కుర్చీలో కూర్చున్నారు. సిబ్బందిపై చైతన్య కాస్త అసహనం వ్యక్తం చేస్తూనే.. వృషకర్మ చిత్రం గురించి మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. విరూపాక్ష'తో టాలీవుడ్‌ను వణికించిన దర్శకుడు కార్తీక్ దండు, ఇప్పుడు నాగచైతన్యతో కలిసి 'వృషకర్మ' అనే భారీ మిథికల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో కార్తీక్ తన సినీ ప్రయాణం, అక్కినేని కుటుంబంతో తనకున్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కార్తీక్ మాట్లాడుతూ.. 'ఏ దర్శకుడికైనా తన హీరోకి కెరీర్ బెస్ట్ సినిమా ఇవ్వాలని ఉంటుంది. నేను అక్కినేని నాగచైతన్యకు తన కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమా ఇస్తున్నాను' అని కార్తీక్ దండు ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పారు. అంతేకాకుండా, 'నాకు సినిమాపై ఇష్టం పెరగడానికి కారణం కింగ్ నాగార్జున గారే. ఆయనే నా మొదటి హీరో. అలాంటిది ఈరోజు ఆయన అబ్బాయితో సినిమా చేయడం, అది కూడా ఇంత పెద్ద స్థాయిలో చేయడం నా అదృష్టం' అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే, ఈ సినిమా విజువల్స్ మిథికల్ ఎలిమెంట్స్ కోసం చిత్ర బృందం గత రెండేళ్లుగా ఎంతో కష్టపడుతోందని, గ్లింప్స్ అనేది కేవలం శాంపిల్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. సుకుమార్ రైటింగ్స్, ÷ఎఅఅ బ్యానర్లపై వస్తున్న ఈ చిత్రం నాగచైతన్యను ముందెన్నడూ చూడని ఒక కొత్త అవతారంలో చూపించబోతోందని కార్తీక్ మాటల ద్వారా అర్థమవుతోంది. దర్శకుడికి హీరోపై ఉన్న ఈ నమ్మకం, అక్కినేని ఫ్యాన్స్‌లో సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

# ఎట్టకేలకు ఓటీటీలోకి ..భర్తమహాశయులకు విజ్ఞప్తి



మాస్ మహారాజ రవితేజ నటించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి ప్రేక్షకుల నుంచి ఓ మాదిరి స్పందన అందుకుంది. అయితే ఈ సినిమా ఇప్పటి వరకు ఓటిటి స్ట్రీమింగ్ మాత్రం కాలేదు. సాధారణంగా థియేటర్ విడుదలైన సినిమాలు 4 నుంచి 6 వారాల్లో ఓటిటిలోకి వస్తాయి. అయితే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విషయంలో స్ట్రీమింగ్ కాలేదు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటిటి ఎ÷-లాట్‌ఫామ్ జీ 5 కొనుగోలు చేసింది. ఆ మధ్య స్ట్రీమింగ్ చేస్తున్నట్టు ప్రకటించారు కానీ అనుకోని కారణాల వలన వాయిదా వేశారు. అనేక మార్లు ఓటీటీ స్ట్రీమింగ్ వాయిదా వేసిన ఈ సినిమా మొత్తానికి ఓటీటీ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. ఈ సినిమాను ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నారు. థియేటర్ రిలీజ్‌కు సుమారు 59 రోజుల తర్వాత ఓటిటిలో స్ట్రీమింగ్‌కు రానుండటం గమనార్హం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఎక్కువ క్షి విండోకి మధ్యలో ఎదురైన కొన్ని ఆర్థిక సమస్యలే కారణమని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై చిత్ర బృందం లేదా ఓటిటి ఎ÷-లాట్‌ఫామ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరి ఈ సారైనా ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తుందో లేదా మరోసారి వాయిదా వేస్తారో మరికొద్ది రోజుల్లో తెలుస్తుంది. మరి ఓటిటిలో విడుదలైన తర్వాత ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాలి.


Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.